JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | మంగళవారం 21-07-2026
Medchal - Malkajgiri | Tuesday 21-07-2026
సంపుటి : 03 | సంచిక : 50
పేజీలు : 8 | వెల : 5
Vol. 03 | Issue 50 | Pages : 8 | ₹: 5
Follow: jayabherinews

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com




నిరుపేద కుటుంబాలకు సొంత ఇళ్లను అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన పథకం ఇందిరమ్మ ఇళ్లు.. ఈ పథకం కింద ఇప్పటి వరకు గ్రామాల్లోనే ఇళ్లను మంజూరు చేసిన ప్రభుత్వం తాజాగా హైదరాబాద్‌లోని క్యూర్ పరిధిలో ఎల్ఐజీ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

# ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం

- సొంతింటి కోసం ఎదురుచూసే వారికి గుడ్‌న్యూస్
- కొత్తగా మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు
- ఇందిరమ్మ ఇల్లు దరఖాస్తు కోసం 21 రోజులు అవకాశం

**జయభేరి, హైదరాబాద్ :**

పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చాలనే ఉద్దేశంతో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. హైదరాబాద్‌లో నివసించే అల్పాదాయ వర్గాల కోసం క్యూర్ పరిధిలో ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అధికారికంగా శ్రీకారం చుట్టింది. ఇవాళ జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లతో పాటు స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా పథకానికి సంబంధించిన దరఖాస్తు విధానం, అర్హతల వివరాలతో కూడిన అధికారిక బ్రోచర్‌ను మంత్రులు విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. నిరుపేదలకు అండగా నిలవాలనే లక్ష్యంతోనే ఈ ప్రాజెక్టును చేపట్టామని తెలిపారు. మొదటి విడతలో భాగంగా సొంత స్థలం ఉన్న వారికి 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేశామని.. ఇవి ఆగస్టు నాటికి 2 లక్షలకు పైగా పూర్తి కానున్నాయని తెలిపారు. రెండో విడతలో మరో 2.5 లక్షల ఇళ్లను ఇచ్చామని తెలిపారు. అయితే, అసలు ఇళ్ల స్థలం లేని నిరుపేదల కోసం ఇప్పుడు క్యూర్ ప్రాంతంలో ఇళ్లను నిర్మించాలని నిర్ణయించాం అని ఆయన అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సొంతిల్లు అందేలా.. ఎలాంటి లాభాపేక్ష, స్వార్థం లేకుండా పూర్తి పారదర్శకంగా ప్రభుత్వ స్థలంలోనే ఈ ఇళ్లను నిర్మించి ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రాంతంలో గజం ధర లక్షల్లో, ఎకరం ధర వందల కోట్లలో ఉన్నప్పటికీ, వెనకడుగు వేయకుండా పేదల

...మిగతాది 2 లో

# యువత రాకెట్‌లా దూసుకెళ్తోంది

పార్లమెంట్ వర్షా కాల సమావేశాల ప్రారంభ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ స్కైరూట్ విక్రమ్-1 విజయాన్ని ప్రశంసిస్తూ, 28 ఏళ్ల సగటు వయస్సు గల యువ బృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా "56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదు" అంటూ రాహుల్ గాంధీపై పరోక్షంగా సెటైర్ వేశారు...



- యువత ప్రతిభకు మోదీ ప్రశంసలు
- ప్రపంచవ్యాప్తంగా భారత్‌కు పెరుగుతున్న గుర్తింపు
- 7.7 శాతం వృద్ధితో భారత్ దూసుకెళ్తోంది
- ఆగస్టు 13 వరకు సమావేశాలు
- '56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదు' అంటూ రాహుల్‌పై మోదీ సెటైర్

**జయభేరి, న్యూఢిల్లీ:**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు కీలక సందేశం ఇచ్చారు. ఈ సమావేశాలు సార్థకంగా, ఫలవంతంగా సాగాలని ఆకాంక్షించిన ఆయన, ప్రజాస్వామ్యంలో వాస్తవాలు, బలమైన వాదనల ఆధారంగా చర్చలు జరగాలని పిలుపునిచ్చారు. యువత ప్రతిభ, దేశ ఆర్థిక పురోగతి, అంతరిక్ష రంగంలో సాధించిన విజయాలు భారత్ భవిష్యత్తుకు బలమైన సంకేతాలని పేర్కొన్నారు. భారత్ ప్రైవేట్ అంతరిక్ష రంగంలో సాధిస్తున్న విజయాలను ప్రస్తావిస్తూ స్కైరూట్ ఏరోస్పేస్ విజయవంతంగా ప్రయోగించిన విక్రమ్ 1 రాకెట్‌ను ప్రధాని అభినందించారు. ఈ విజయం భారత యువత సామర్థ్యానికి నిదర్శనమని ఆయన అన్నారు. స్కైరూట్ సంస్థలో పని చేస్తున్న బృందం సగటు వయస్సు కేవలం 28 సంవత్సరాలు మాత్రమేనని పేర్కొంటూ,

...మిగతాది 2 లో

# తల్లి–శిశువులకు కల్పించిన ప్రత్యేక సౌకర్యాలు

- 'తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్' నూతన వాహనాలను పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- సకల సౌకర్యాలతో త్వరలో అందుబాటులోకి 500 కొత్త వాహనాలు
- ఏటా సుమారు 2.75 లక్షల మంది బాలింతలకు ప్రయోజనం



2 లో

**జయభేరి, అమరావతి, జూలై 20 :**

రాష్ట్రంలో మాతా-శిశు సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోన్న ప్రభుత్వం... గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు మరింత నాణ్యమైన, సురక్షితమైన రవాణా సేవల్ని అందించేందుకు కొత్తగా 'తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్' వాహనాలను అందుబాటులోకి తెస్తోంది. ఈ వాహనాలను సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎం క్యాంపు కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యక్రమం కోసం సిద్ధం చేసిన వాహనాల రూపకల్పన, భద్రతా ప్రమాణాలు, తల్లి-శిశువులకు కల్పించిన ప్రత్యేక సౌకర్యాలు, వాహనాలపై రూపొందించిన బ్రాండింగ్ నమూనాలను ముఖ్యమంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు ఈ సేవలపై స్పష్టమైన అవగాహన కలిగేలా, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన బ్రాండింగ్ డిజైన్లకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు.



2 లో

# ఫ్యూచర్ సిటీలో ఉద్యమకారుల కాలనీ కేటాయించాలి

- తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, రూ.25 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్.
- సెప్టెంబర్ 17 నాటికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని కమిటీకి విజ్ఞప్తి.
- ఫ్యూచర్ సిటీలో ఉద్యమకారుల కోసం 600 ఎకరాలతో ప్రత్యేక కాలనీ ఏర్పాటు ప్రతిపాదన.
- ఉద్యమకారులకు EHS తరహాలో ఉచిత వైద్య సేవలు, హెల్త్ కార్డులు ఇవ్వాలని సూచన.
- 500-600 మంది ఉద్యమకారుల వివరాలను ప్రభుత్వానికి అందించేందుకు సంఘం సిద్ధమని కాచం సత్యనారాయణ వెల్లడి.



# భయపెడుతున్న కరోనా

**జయభేరి, విజయవాడ, జూలై 20 :**

ఆంధ్రప్రదేశ్ నుండి కరోనాకు సంబంధించి ఒక కొత్త వార్త వెలుగులోకి వచ్చింది. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆంధ్రప్రదేశ్‌లో ఒమిక్రాన్ RF.5 వేరియంట్ బయటపడినట్లు తెలిపారు. కడప జిల్లాలో కోవిడ్ 19 పాజిటివ్‌గా తేలిన నలుగురు రోగుల శాంపిల్స్‌ను జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం పుణెలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపించారు. ఇప్పుడు అక్కడ నుండి వచ్చిన నివేదికలో ఆ నలుగురి శాంపిల్స్‌లో ఒమిక్రాన్ యొక్క RF.5 సబ్‌లైనేజ్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. మంత్రి శనివారం రాత్రి విడుదల

...మిగతాది 2 లో

# తెలంగాణలో వైద్యం.. ఆరోగ్యం పడకేసాయి

- మాజీ మంత్రి హరీష్ రావు



2 లో

**జయభేరి, హైదరాబాద్ :**

బాన్సువాడ మాతాశిశు ఆసుపత్రిలో శస్త్రచికిత్స అనంతరం తీవ్ర అస్వస్థతకు గురై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలింతలను, వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి హరీష్ రావు పరామర్శించాను. బాలింతల ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్యంపై నిమ్స్ డాక్టర్లను అడిగి తెలుసకున్నారు. అలాగే, ఖమ్మంలో జరిగిన దారుణ ఘటనలో తీవ్రంగా గాయపడి నిమ్స్ లోనే చికిత్స పొందుతున్న మైనర్ బాలికను కూడా పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. హరీష్ రావు మాట్లాడుతూ ...ఈ నెల 13వ తేదీన బాన్సువాడ ఆసుపత్రిలో డెలివరీకి వెళ్లిన 10 మంది మహిళలకు సిజేరియన్ ఆపరేషన్ చేసిన తర్వాత ఇన్ఫెక్షన్స్ సోకి పరిస్థితి విషమించింది. వారిని నిజామాబాద్ ఆసుపత్రికి, అక్కడి నుంచి నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం నిమ్స్ లో ఫాతిమా, రుక్సానా, జ్యోతి, లక్ష్మీప్రియ, సునీత అనే ఐదుగురు బాలింతలు చికిత్స పొందుతున్నారు. ఈ ఐదుగురిలో ముగ్గురి పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. తెల్ల రక్త కణాలు తగ్గిపోవడం, ఊపిరితిత్తులు మరియు కిడ్నీలలో ఇన్ఫెక్షన్ కారణంగా వారు ఐసీయూలో డయాలసిస్ పైన ఉన్నారు. ఈ దారుణమైన సంఘటన జరిగి 10 రోజులు కావస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఎల్ఐజీ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం

ఆత్మగౌరవం కోసం ఇక్కడే ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం డిసైడ్ అయిందని మంత్రులు తెలిపారు. రాష్ట్రంలోని 26 నియోజక వర్గాలల్లో 500 ఇళ్లను అపార్ట్‌మెంట్ తరహాలో నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఒక్కో ఫ్లాట్ 500 చదరపు అడుగుల (SFT) వైశాల్యంలో, అన్ని వసతులతో ఉంటుందని వెల్లడించారు. ఇక ఈ ఇండ్లకు అర్హులు ఎవరంటే.. ఏడాది ఆదయారం రూ. 6 లక్షలుగా ఉండి, సొంత ఇల్లు, స్థలం లేని వారిని ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఈ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ.11లక్షలు ఖర్చు అవుతుందని.. కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం రూ.5 లక్షలు ఇస్తుందని.. మిగతా రూ .6లక్షలు 4విడతల్లో లబ్ధిదారులు చెల్లించాలని మంత్రి పొంగులేటి తెలిపారు. దళారుల మాయమాటలకు మోసపోవద్దు.. ఎవ్వరికీ ఒక్క పైసా కూడా ఇవ్వవద్దని తెలిపారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ రిజర్వేషన్లు కల్పిస్తామని తెలిపారు.

**ఎలా ధరఖాస్తు చేసుకోవాలి?**

ఈ ఇళ్ల కోసం ధరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 10 వరకు అవకాశం ఉందన్నారు. ఈ పథకానికి ధరఖాస్తు చేసుకోవాలంటే, ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసిన ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు ఫారమ్‌ను ప్రజా పాలన కేంద్రాల్లో లేదా మీసేవ కేంద్రాల ద్వారా నింపి సమర్పించాల్సి ఉంటుంది. అలాగే మీసేవా ద్వారా కూడా రూ.100 చెల్లించి ఇందిరమ్మ ఇళ్ల కోసం ధరకాస్తు చేసుకోవచ్చన్నారు. అయితే ఈ కార్యక్రమం సందర్భంగా హౌసింగ్ పథకానికి ఆకర్షణీయమైన పేరును సూచించేందుకు హౌసింగ్ బోర్డు నిర్వహించిన పేరు పెట్టు గిఫ్ట్ పట్టు కాంటెస్ట్‌లో విజయం సాధించిన వారిని మంత్రులు బహుమతిని అందజేశారు. ఈ పోటీలో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం పోటీలో 14వేల మంది పాల్గొన్నగా.. వారిలో నల్గొండ జిల్లాకు చెందిన కొండా నాగరాజు విజేతగా నిలిచారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాగరాజుకు లక్ష రూపాయల నగదు బహుమతిని అందజేసి అభినందించారు.

## యువత రాకెట్‌లా దూసుకెళ్తోంది

ఇలాంటి యువ శాస్త్రవేత్తలు దేశానికి గర్వకారణమని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని పరోక్షంగా ఉద్దేశించినట్లు భావిస్తున్న వ్యాఖ్యలు కూడా చేశారు. "నేను 56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదు" అని వ్యాఖ్యానించడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

గత నెల రోజుల్లో భారత్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక కీలక విజయాలను నమోదు చేసిందని ప్రధాని తెలిపారు. గత వర్షాకాల సమావేశాలకు ముందు భారత వ్యోమగామి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ISS) వెళ్లిన విషయాన్ని గుర్తు చేసిన ఆయన, ఇప్పుడు ప్రైవేట్ భారతీయ స్టార్టప్ అంతరిక్ష ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించడం మరో చారిత్రక ఘట్టమని అన్నారు. భారత యువత ఆశయాలు, సామర్థ్యం అంతరిక్షం అంత విస్తృతమని ప్రపంచానికి ఈ విజయాలు బలమైన సందేశాన్ని ఇస్తున్నాయని మోదీ పేర్కొన్నారు. దేశ ప్రతిష్ఠ అంతర్జాతీయ వేదికలపై మరింత పెరుగుతోందని ఆయన అన్నారు. పార్లమెంట్ సమావేశాల ప్రారంభానికి ముందు మీడియాతో మాట్లాడిన ప్రధాని, వర్షాకాలం ఎలా దేశానికి ఉపయోగపడుతుందో, అలాగే వర్షాకాల సమావేశాలు కూడా దేశ అభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. వర్షాలు సమయానికి కురవడం ఎంత ముఖ్యమో, పార్లమెంట్ సమావేశాలు కూడా అదే విధంగా సజావుగా, ఫలవంతంగా సాగాలని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధ పరిస్థితులు, ఆర్థిక అనిశ్చితులు ఉన్నప్పటికీ భారత్ అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని పేర్కొంటూ, ఈ సమావేశాలు అభివృద్ధికి మరింత ఊతమివ్వాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు, ప్రపంచ ఆర్థిక సవాళ్లను ప్రస్తావించిన ప్రధాని, ఇలాంటి పరిస్థితుల్లో కూడా భారత్ 7.7 శాతం ఆర్థిక వృద్ధి నమోదు చేసి ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో అత్యంత వేగంగా ఎదుగుతున్న దేశంగా నిలిచిందని తెలిపారు. దేశ పురోగతి వేగంగా కొనసాగుతోందని, పార్లమెంట్‌లో జరిగే నిర్మాణాత్మక చర్చలు ఈ అభివృద్ధిని మరింత బలోపేతం చేస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. పార్లమెంట్‌లో ముఖ్యంగా తొలిసారి ఎన్నికైన, యువ సభ్యులకు మాట్లాడే అవకాశం కల్పించాలని ప్రధాని సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి స్వరానికీ విలువ ఉండాలని, బలమైన వాస్తవాలు, ఆధారాలతో తమ అభిప్రాయాలను ధైర్యంగా వినిపించాలని సభ్యులకు సూచించారు. ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య చర్చల ద్వారా దేశ ప్రయోజనాలు మరింత ముందుకు సాగుతాయని ఆయన అన్నారు. ఈ ఏడాది వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు ఆగస్టు 13 వరకు కొనసాగనున్నాయి. ఈ సమావేశాల్లో ప్రభుత్వం పలు కీలక సంస్కరణ బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. ప్రభుత్వ ప్రాధాన్య జాబితాలో ఫారిన్ కాంట్రిబ్యూషన్ (రెగ్యులేషన్) సవరణ బిల్లు-2026 ప్రధానంగా ఉంది. విదేశీ నిధుల నియంత్రణ చట్టంలో మార్పులు చేయడం దీని ఉద్దేశం. అదేవిధంగా ఉన్నత విద్యా వ్యవస్థలో సంస్కరణలకు సంబంధించిన విక్సిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు-2025ను కూడా ప్రభుత్వం ముందుకు తీసుకురానుంది. ఇది ఇప్పటికే సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలన పూర్తి చేసుకుంది. ఈ సమావేశాల్లో ఆదాయపు పన్ను (సవరణ) బిల్లు-2026ను కూడా ప్రవేశపెట్టే అవకాశం ఉంది. విదేశీ పెట్టుబడిదారులకు కొన్ని ప్రభుత్వ సెక్యూరిటీలపై పన్ను మినహాయింపులను కొనసాగించే ఆర్డినెన్స్‌కు బదులుగా ఈ చట్టాన్ని తీసుకురానున్నారు. అలాగే సుప్రీంకోర్టు సవరణ బిల్లు-2026 ద్వారా ప్రధాన న్యాయమూర్తిని మినహాయించి సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 33 నుంచి 37కు పెంచే ప్రతిపాదన ఉంది. పెరుగుతున్న పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించడమే దీని లక్ష్యం. ఇవే కాకుండా ఎంఎస్ఎంఈ అభివృద్ధి (సవరణ) బిల్లు-2026, జనన-మరణాల నమోదు చట్ట సవరణలు, జాతీయ గౌరవానికి అవమానం నివారణ చట్టంలో మార్పులు వంటి కీలక బిల్లులు కూడా సభ ముందుకు రానున్నాయి. ప్రభుత్వం సంస్కరణలపై దృష్టిసారిస్తుండగా, ప్రతిపక్షం పలు కీలక అంశాలను లేవనెత్తేందుకు సిద్ధమవుతోంది. దీంతో ఆగస్టు 13 వరకు కొనసాగే వర్షాకాల సమావేశాల్లో తీవ్ర చర్చలు, వాడివేడి వాదోపవాదాలు జరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## భయపెడుతున్న కరోనా

చేసిన తన అధికారిక పత్రికా ప్రకటనలో ఈ విషయాన్ని తెలియజేశారు, ఆరోగ్య శాఖ అధికారులతో ఫోన్ ద్వారా ఈ విషయంపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం కరోనా వైరస్ ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల కోవిడ్ 19 కేసులు నమోదు కావడంతో పాటు మరణాలు సైతం సంభవిస్తున్నాయి. ఈ క్రమంలో ఏపీలో నమోదవుతున్న కరోనా పాజిటివ్ కేసులపై ఏపీ ప్రభుత్వం కీలక అప్డేట్ ఇచ్చింది. రాష్ట్రంలో నమోదవుతున్న కరోనా వైరస్ కేసులు ఒమిక్రాన్ RF.5 వేరియంట్ అని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కడప జిల్లాల్లో ఇటీవల కొందరికి కోవిడ్ 19 పాజిటివ్ రావడంతో శాంపిల్స్ సేకరించి, జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం పుణెలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపారు. ఆ నివేదిక చెక్ చేయగా నలుగురి శాంపిల్స్‌లో ఒమిక్రాన్ RF.5 వేరియంట్ ఉన్నట్లు గుర్తించారు. ఆరోగ్య శాఖ అధికారులతో మంత్రి సత్యకుమార్ నిరంతరం టచ్‌లో ఉండి కేసుల నమోదు, వైరస్ వ్యాప్తి అంశాలపై చర్చిస్తున్నారు. తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, లక్షణాలు ఉన్న వారు వెంటనే కోవిడ్ టెస్టులు చేయించుకోవాలని సూచించారు. RF.5 అనేది కరోనా వైరస్ ఒమిక్రాన్ వేరియంట్‌కు చెందిన ఒక సబ్ వేరియంట్. ప్రపంచవ్యాప్తంగా ఒమిక్రాన్‌కు చెందిన ఇలాంటి అనేక సబ్ వేరియంట్ కేసులను ఇదివరకే ఇప్పటికే గుర్తించారు. వాటిలో RF.5 సబ్ వేరియంట్ కూడా ఒకటి. మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ విష్ణువర్ధన్ కరోనా కేసులపై స్పందించారు. ఈ వేరియంట్ సహజంగానే రూపాంతరం చెందిందని, JN.1 వేరియంట్ నుండి జరిగిందని తెలిపారు. అది LF.7 ద్వారా వ్యాపించి PY.1.1.1 శాఖకు చేరుకుందని, ఆ తర్వాత దాని నుండి RF.5 వేరియంట్ ఏర్పడిందని వివరించారు. రెండు వేరియంట్లు కలవడం వల్ల ఏర్పడిన వేరియంట్ కాదని అధికారులు తెలిపారు. కేవలం కరోనా వైరస్‌పై నిఘా ఉంచే సాధారణ జీనోమిక్ సర్వైలెన్స్ ప్రక్రియలోనే ఈ వేరియంట్ గుర్తించారు. ఇప్పటివరకు అందిన ఆధారాల ప్రకారం, RF.5 వేరియంట్ మిగిలిన ఒమిక్రాన్ వేరియంట్ల కంటే ఎక్కువ ప్రమాదకరం అని సంకేతాలు ఏవీ లేవని విష్ణువర్ధన్ తెలిపారు. ప్రజలు కేవలం అప్రమత్తంగా ఉండాలని, RF.5 లక్షణాలు కూడా మిగిలిన ఒమిక్రాన్ సబ్‌వేరియంట్ల లాగే ఉన్నాయని పేర్కొన్నారు. వీటి లక్షణాలలో జ్వరం, తలనొప్పి, గొంతు నొప్పి, దగ్గు, ఒళ్లు నొప్పులు ఉన్నాయి. ఎవరికైనా ఈ లక్షణాలు కనిపిస్తే, చాలా తీవ్రమైన కేసు అని భావించాల్సిన అవసరం లేదన్నారు. అయినప్పటికీ పరీక్ష చేయించుకోవడం, డాక్టర్‌ను సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు.

# భార్యల చేతిలో భర్తల 'బలి'



దేశంలో భర్తల భద్రతపై ఆందోళన పెంచుతున్న 'ఏకం న్యాయ్ ఫౌండేషన్' నివేదిక సంచలనం రేపుతోంది. 2026 జనవరి నుండి జులై 14 వరకు ఆరు నెలల కాలంలో ఏకంగా 554 మంది భర్తలు హత్యలు లేదా ఆత్మహత్యల కారణంగా ప్రాణాలు కోల్పోయినట్లు ఈ నివేదిక వెల్లడించింది. ఇందులో 322 మంది భార్యలు లేదా వారి ప్రియుల చేతిలో దారుణంగా హత్యకు గురయ్యారు. మిగిలిన 232 మంది వైవాహిక విభేదాలు, గృహహింస, మానసిక వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నారు. ప్రతిరోజూ సగటున ఇద్దరు భర్తలు హత్యకు గురవుతుండగా, ఒకరి కంటే ఎక్కువ మంది ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ మరణాల వెనుక వివాహేతర సంబంధాలు, కుటుంబ కలహాలు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. కుటుంబ వ్యవస్థలో పెరుగుతున్న అశాంతి పురుషుల జీవితాలను తీవ్ర ప్రమాదంలోకి నెట్టేస్తోంది. ఈ గణాంకాలు సమాజంలో నెలకొన్న విషాదకర పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. భర్తలపై జరుగుతున్న హత్యలు, ఆత్మహత్యలపై గురుగ్రామ్‌కు చెందిన ఏకం న్యాయ్ ఫౌండేషన్ విడుదల చేసిన తాజా నివేదిక తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 2026 తొలి ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా 554 మంది భర్తలు హత్యలు, ఆత్మహత్యలు చోటు చేసుకున్నట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ సంస్థ వెల్లడించింది. అయితే ఇవి ప్రభుత్వ అధికారిక గణాంకాలు కాదని.. మీడియా కథనాలు, ఫౌండేషన్ సేకరించిన వివరాల ఆధారంగా రూపొందించిన డాక్యుమెంటేషన్ రిపోర్టు మాత్రమేనని స్పష్టం చేసింది. ఈ నివేదిక ప్రకారం.. మొత్తం 322 మంది భర్తలు హత్యకు గురయ్యారని తెలుస్తోంది. వీరిలో అత్యధిక కేసులు భార్యలు లేదా వారి వివాహేతర సంబంధాల నేపథ్యంలో జరిగిన కుట్రలతో ముడిపడి ఉన్నట్లు ఆ సంస్థ పేర్కొంది. మొత్తం హత్యల్లో 194 కేసులు (సుమారు 60.2 శాతం) వివాహేతర సంబంధాల కారణంగానే జరిగినట్లు ఆ రిపోర్టు వెల్లడించింది. భార్యలు, తమ ప్రియులతో కలిసి కట్టుకున్న భర్తలను హత్య చేసిన ఘటనలు ఎక్కువగా నమోదు అయ్యాయని ఆ నివేదిక తెలిపింది. అదే సమయంలో 232 మంది భర్తలు ఆత్మహత్యలకు పాల్పడినట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ పేర్కొంది. వీటిలో కుటుంబ కలహాలు, గృహహింస, మానసిక వేధింపులు, తప్పుడు క్రిమినల్ కేసులు, పిల్లలను కలవనివ్వకపోవడం వంటి కారణాలు ప్రధానంగా ఉన్నాయని నివేదికలో వివరించింది. ఈ కేసుల్లో విషం పెట్టి చంపడం, గొంతు నులిమి హత్య చేయడం, విద్యుత్ షాక్ పెట్టి హతమార్చడం, సజీవదహనం చేయడం, మృతదేహాలను ముక్కలు ముక్కలుగా నరకడం, చంపేసి ప్రమాదంగా లేదా ఆత్మహత్యగా చిత్రీకరించడం వంటి అత్యంత దారుణమైన నేరాలు నమోదు అయినట్లు ఆ నివేదిక తెలిపింది. రాష్ట్రాల వారీగా చూస్తే అత్యధికంగా 93 హత్యలు, 103 ఆత్మహత్యలతో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచినట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ రిపోర్టు తెలిపింది. ఆ తర్వాత మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, మహారాష్ట్ర, హర్యానా, బీహార్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో కూడా ఇలాంటి కేసులు ఎక్కువగా నమోదు అయ్యాయని పేర్కొంది. అయితే.. ఈ నివేదికపై ప్రభుత్వ అధికారిక ధృవీకరణ లేదని ఆ సంస్థ స్పష్టం చేసింది. దేశంలో భర్తల హత్యలు లేదా పురుషులపై గృహహింసకు సంబంధించిన ప్రత్యేక జాతీయ డేటాబేస్ లేకపోవడంతో అసలు సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏకం న్యాయ్ ఫౌండేషన్ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లాలో జరిగిన ఘటన అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. అతుల్ పవార్ అనే వ్యక్తిని తన భార్య దామిని, ప్రియుడు తుషార్‌తో కలిసి విష సర్పంతో కాటేయించి చంపేసింది. భర్త పేరుపై ఉన్న 20 లక్షల రూపాయల బీమా సొమ్మును కాజేయాలని, ప్రియుడితో కలిసి జీవించాలని ఆమె పన్నిన పన్నాగం ఇది. నిందితులు పామును కొనుగోలు చేసి, నిద్రమాత్రలు కలిపిన పాలు తాగించి ఈ దారుణానికి ఒడిగట్టారు. పోలీసులు సాంకేతిక ఆధారాలు, కాల్ డేటాను విశ్లేషించి నిందితులను అరెస్టు చేశారు. 20 రోజుల క్రితమే కారుతో ఢీకొట్టి చంపేందుకు ప్రయత్నించినట్లు విచారణలో తేలింది. ఈ కేసు భార్యాభర్తల మధ్య పెరిగిపోయిన ద్వేషాన్ని, డబ్బు కోసం ఎంతటి దారుణానికైనా తెగించే కఠిన మనస్తత్వాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. ఇలాంటి ఘటనలు కుటుంబ సంబంధాల పునాదులను పూర్తిగా దెబ్బతీస్తున్నాయి. వైవాహిక జీవితంలో నెలకొంటున్న ఇటువంటి తీవ్రమైన సమస్యలను పరిష్కరించేందుకు కౌన్సెలింగ్, చట్టపరమైన అవగాహన కార్యక్రమాలు అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు. కేవలం చట్టం మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యతతో కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మానసిక ఒత్తిడి, అపార్థాలను తొలగించుకోవడానికి సంభాషణలు మాత్రమే సరైన మార్గం. పురుషులు కూడా తమ సమస్యలను పంచుకునే వేదికలు, మానసిక ఆరోగ్య సేవలు అందుబాటులోకి రావాలి. ఈ గణాంకాలు ప్రభుత్వాలు, సమాజం కలిసి పని చేయాల్సిన సమయం ఆసన్నమైందని హెచ్చరిస్తున్నాయి. భర్తల ప్రాణాలను కాపాడడం, కుటుంబాలను విచ్ఛిన్నం కాకుండా చూడడం అందరి బాధ్యత. రాబోయే రోజుల్లో అయినా ఇటువంటి దుర్మార్గమైన ఘటనలు తగ్గుతాయని, ఆరోగ్యకరమైన కుటుంబ సంబంధాలు నెలకొంటాయని ఆశిద్దాం. సామాజిక చైతన్యం ద్వారా మాత్రమే ఇటువంటి దారుణాలకు ముగింపు పలకడం సాధ్యమవుతుంది. ఈ సమస్య తీవ్రతను అంచనా వేయాలంటే అధికారిక గణాంకాల సేకరణ అవసరమని ఏకం న్యాయ్ ఫౌండేషన్ సంస్థ సూచించింది.

## తెలంగాణ లో వైద్యం.. ఆరోగ్యం పడకేసాయి

ఏ ఒక్క మంత్రి, ఎమ్మెల్యే లేదా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారి వచ్చి బాధితులను పరామర్శించిన పాపాన పోలేదని అన్నారు. అసలు ఈ సంఘటన ఎందుకు జరిగింది? దీని వెనుక ఉన్న కారణాలు ఏంటి? అని తెలుసుకునే కనీస ప్రయత్నం కూడా ప్రభుత్వం చేయలేదు. ఇప్పటి వరకు పూర్తి స్థాయి విచారణకు కూడా ఆదేశించకపోవడం దారుణం. బాలింతలు పూర్తిగా కోలుకోకపోతే రేపు ఆ పసిపిల్లల్ని ఎలా చూసుకోవాలి. ఆ కుటుంబ పరిస్థితులు ఎంత దారుణంగా దెబ్బతింటాయో ప్రభుత్వం ఒక్కసారి ఆలోచించాలి. 10వ తేదీన ఆరుగురికి సిజేరియన్ చేసినప్పుడు వారికి ఇన్ఫెక్షన్ వచ్చిందని తెలిసిన తర్వాత కూడా.. అదే థియేటర్లో మళ్ళీ మరో నలుగురికి సిజేరియన్ ఎందుకు చేశారు.. ఆపరేషన్ జరిగిన వారికి రాత్రి నుంచే మోషన్స్, వాంతులు, చలిజ్వరంతో ఇబ్బంది పడుతున్నా.. అదే ఆపరేషన్ థియేటర్లో మరో నలుగురికి సిజేరియన్ చేయడం వల్ల వారు కూడా ఇన్ఫెక్షన్ బారిన పడ్డారు. ఆపరేషన్ థియేటర్లో మెయింటెనెన్స్ సరిగా లేకపోవడం వల్లే ఇన్ఫెక్షన్ సోకిందని, డాక్టర్ల నిర్లక్ష్యానికి తాము బలయ్యామని బాధిత కుటుంబాలు చెబుతున్నాయి. కాలం చెల్లిన మందులు వాడటం వల్లే తమకు ఈ పరిస్థితి ఏర్పడిందని ఇంకొక పేషెంట్ బంధువులు ఆరోపిస్తున్నారు. ఇంత తీవ్రమైన ఘటన జరిగితే ప్రభుత్వం ఎందుకు గోప్యంగా ఉంచే ప్రయత్నం చేస్తోంది? దీనిపై ఎందుకు విచారణకు ఆదేశించలేదు.. ఈ ఘటనపై తక్షణమే పూర్తి స్థాయి విచారణ జరపాలి. నిర్లక్ష్యానికి కారణమైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఒక పేషెంట్ నిజామాబాద్ లోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్తే రెండు రోజుల్లోనే 3 లక్షల రూపాయలు ఖర్చు అయ్యాయి. వంటి మీదున్న బంగారం అమ్ముకుని, మూడు రూపాయల వడ్డీకి అప్పు తెచ్చి ఖర్చు పెట్టినా తన బిడ్డ ఆరోగ్యం ఇంకా మెరుగుపడలేదని ఆ తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నేరపూరితమైన నిర్లక్ష్యం. రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖ పూర్తిగా పడకేసిందని అన్నారు. 10 మంది మహిళల ప్రాణాలతో చెలగాటమాడినా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదు. మీ ఇందిరమ్మ పాలనలో మహిళల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. ఇందిరమ్మ పాలన అనేది కేవలం మాటల్లోనే ఉంది. మొన్నటికి మొన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆసుపత్రిలో జాయిన్ చేసుకోకపోవడం, బెడ్ ఇవ్వకపోవడం వల్ల నిలబడే బిడ్డకు జన్మనిచ్చిన హృదయ విధారకమైన సంఘటన ఈ రాష్ట్రంలో జరిగింది. తల్లులకు సోకిన ఇన్ఫెక్షన్ పాల రూపంలో పసిపిల్లలకు కూడా చేరి.. ఆ పిల్లలు జాండిస్ తో రకరకాల ఇబ్బందులు పడుతూ నీలోఫర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రులను గాలికి వదిలేసింది. కేసీఆర్ గారి ప్రభుత్వం ఉన్నప్పుడు బిడ్డ కడుపులో పడగానే న్యూట్రిషన్ కిట్, పుట్టగానే కేసీఆర్ కిట్ ఇచ్చాం.

ఆరోగ్య లక్ష్మి పథకం కింద పాలు, పౌష్టికాహారాన్ని అందించాం. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీలు కేవలం 30 35% ఉంటే, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దానిని 72 శాతానికి తీసుకువెళ్ళాం. కానీ ఈరోజు మళ్ళీ అది 50 శాతానికి పడిపోయింది. సి సెక్షన్ రేటు విపరీతంగా పెరిగిపోయింది.

ఆసుపత్రులను మానిటర్ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. రేవంత్ రెడ్డి ఏమీ బంద్ చేయలేదు అంటారు, కానీ న్యూట్రిషన్ కిట్, కేసీఆర్ కిట్ బంద్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు సకాలంలో లేకపోవడం వల్ల నమ్మకం సన్నగిల్లి డెలివరీల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మదర్ మోర్టాలిటీ రేటును 92% నుంచి 43 కు తగ్గించి, దేశంలోనే మూడవ ఉత్తమ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాం. కానీ మీ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రులకు సుస్తీ పట్టింది. ఈ సంఘటన మీద మీరేమైనా ఎంక్వయిరీ ఆర్డర్ చేశారా? చేస్తే ఆ ఎంక్వయిరీ రిపోర్ట్ బయట పెట్టండి. ఆ సిబ్బంది ఎవరు, డాక్టర్స్ ఎవరు అన్నది వెల్లడించి వారిపై యాక్షన్ తీసుకోవాలి. ఆ తల్లులకు కాళ్లు వాపులు వస్తున్నాయి, డయాలసిస్ జరుగుతోంది. భవిష్యత్తులో కూడా లైఫ్ లాంగ్ డయాలసిస్ తీసుకోవాల్సి వస్తే మా పుట్టిన పిల్లల పరిస్థితి ఏంటి అని ఆ తల్లులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధిత కుటుంబాలకు పూర్తి స్థాయి వైద్యం అందించి, వారికి తగిన ఎక్స్ గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

## తల్లీ–శిశువులకు

**అందుబాటులోకి 500 వాహనాలు**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలు, వారి నవజాత శిశువులు, సహాయకులను ఉచితంగా వారి ఇళ్లకు చేర్చడంతో పాటు అధిక ప్రమాద గర్భిణులు, తీవ్ర రక్తహీనతతో బాధపడే గర్భిణులకు వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రులకు వచ్చే గర్భిణులకు ఈ వాహనాలతో రవాణా సేవలు అందించనున్నారు. ఈ కార్యక్రమం కోసం రాష్ట్రవ్యాప్తంగా 500 ప్రత్యేక SUV/MUV వాహనాలను వినియోగించనున్నారు. ప్రతి సంవత్సరం సుమారు 2.75 లక్షల మంది బాలింతలు ఈ సేవల ద్వారా ప్రయోజనం పొందనున్నారు.

**రియల్ టైమ్ పర్యవేక్షణకు జీపీఎస్ వ్యవస్థ**

వాహనాల్లో తల్లీ-శిశువుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా సౌకర్యాలను కల్పించారు. వెనుక సీట్లలో సీటు బెల్టులు, బాలింతలు సులభంగా ఎక్కేందుకు ఫుట్‌రెస్ట్, ఎయిర్ కండిషనింగ్, ఫస్ట్ ఎయిడ్ కిట్, ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ప్రతి వాహనంలో జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా రియల్ టైమ్ పర్యవేక్షణకు అవకాశం కల్పించారు. వాహనాల పరిశీలన సందర్భంగా అధికారులు కార్యక్రమం అమలు విధానం, వాహనాల నిర్వహణ, రాష్ట్రవ్యాప్తంగా సేవల విస్తరణపై ముఖ్యమంత్రికి వివరించారు. వాహనాలపై అధికారిక స్టిక్కరింగ్ పూర్తి చేసి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వీటి సేవలు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్యకుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి వీరపాండ్యన్, ఆ శాఖ ఉన్నతాధికారులు, జాతీయ ఆరోగ్య మిషన్ (NHM) అధికారులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీలో ఉద్యమకారుల కాలనీ కేటాయించాలి




✍ **జయభేరి, హైదరాబాద్:**

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన చర్చా వేదికలో ఉద్యమకారుల సంక్షేమం, గుర్తింపు ప్రక్రియ, భవిష్యత్ సంక్షేమ చర్యలపై పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కాచం సత్యనారాయణ ఉద్యమకారుల తరపున రూపొందించిన ఏకవాక్య తీర్మానాన్ని ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, రాములు నాయక్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కాచం సత్యనారాయణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి తెలంగాణ ఉద్యమకారునికి 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25 వేల పింఛన్, అధికారిక గుర్తింపు కార్డులు వెంటనే మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి హామీలను అమలు చేయాలని కోరారు.

గతంలో శ్రీకృష్ణ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించిన విధంగానే ప్రస్తుతం ఏర్పాటు చేసిన గుర్తింపు కమిటీ కూడా ఉమ్మడి పది జిల్లాల్లో విస్తృతంగా పర్యటించి ఉద్యమకారులు, జర్నలిస్టులు, విద్యార్థి నాయకులు, ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరి నుంచి వివరాలు సేకరించాలని సూచించారు. సెప్టెంబర్ 17 నాటికి కనీసం ప్రాథమిక గుర్తింపు కార్డులు జారీ చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారుల ఖచ్చితమైన వివరాలు ప్రభుత్వానికి అందుబాటులోకి వస్తాయని, తద్వారా సంక్షేమ పథకాలను వేగంగా అమలు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 24 నియోజకవర్గాల ఉద్యమకారుల కోసం ప్రత్యేక స్థలాలు కేటాయించాలని ఆయన ప్రతిపాదించారు. ప్రతి నియోజకవర్గానికి 20 ఎకరాల చొప్పున మొత్తం 600 ఎకరాల్లో ప్రత్యేక ఉద్యమకారుల కాలనీ లేదా తెలంగాణ అమరుల స్మృతివనం ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న ఈహెచ్ఎస్ (EHS) తరహాలో ఉద్యమకారులకు కూడా ఉచిత వైద్య సేవలు అందేలా ప్రత్యేక హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం వద్ద 2014 నుంచి నమోదైన 500 నుంచి 600 మంది ఉద్యమకారుల పూర్తి వివరాలు, పోలీసు కేసుల సమాచారం, ఫోటో ఆధారాలు సిద్ధంగా ఉన్నాయని, గుర్తింపు ప్రక్రియ కోసం అవసరమైతే వాటిని ప్రభుత్వానికి అందించేందుకు సిద్ధంగా ఉన్నామని కాచం సత్యనారాయణ తెలిపారు. చివరగా ప్రభుత్వం ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లను నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాలు చేపట్టి, ఉద్యమకారుల హక్కుల సాధన కోసం అవసరమైతే చట్టసభల్లోనూ గళమెత్తుతామని ఆయన స్పష్టం చేశారు.

# యాదగిరిగుట్ట కొండపైన ప్రత్యేక పూజలు

■ యాదగిరీశుడి నిత్యరాబడి రూ.15.50 లక్షలు

జయభేరి, యాదగిరిగుట్ట, జులై 20:
యాదగిరిగుట్ట కొండపైన కొలువైన శ్రీపర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం శివుడికి ప్రీతికరమైన రోజు కావడంతో రామలింగేశ్వరుడికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

**శ్రీనారసింహుడికి నిత్యపూజలు..**
శ్రీలక్ష్మినరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. సోమవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహ





స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శ్రీనారసింహుడి నిత్యరాబడి..**
శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా సోమవారం రూ.15,50,949 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.71,450, బ్రేక్ దర్శనం ద్వారా రూ.66,000, శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాల ద్వారా రూ.34,000, వీఐపీ దర్శనం ద్వారా రూ.1,34,100, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.3,12,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.43,664, ప్రసాద విక్రయం ద్వారా రూ.4,51,010, కల్యాణకట్ట ద్వారా రూ.39,500తో పాటు వివిధ శాఖలు, పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.



## కనబడుటలేదు

జయభేరి, హయత్ నగర్ :
హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాస కాలనీలో నివసించేటటువంటి వల్లవోజు నర్సింగ్ రావు (42), వ్యక్తి కనబడుటలేదు. ఇతనికి మతిస్థిమితం సరిగా లేదు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా, హయతనగర్ పోలీస్ లు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇతని ఆచూకీ తెలిసిన వారు హయత్ నగర్ పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇవ్వగలరు. హయతనగర్ పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్ లు 87126 62640, 87126 62301, 87125 79299.

## టిఆర్ పి పాలమూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా వర్మ ముదిరాజ్

■ పార్టీ అధినేత తీన్మార్ మల్లన్నకు వర్మ కృతజ్ఞతలు



జయభేరి, దేవరకద్ర :
మహబూబ్ నగర్ జిల్లా తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టిఆర్ పి) ప్రధాన కార్యదర్శిగా దేవరకద్ర మున్సిపాలిటీకి చెందిన రఘువీర వర్మ ను ఆ పార్టీ అధిష్టానం నియమించింది. దేవరకద్రలో సోమవారం జరిగిన నియోజకవర్గంలోని ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు నియామక కార్యక్రమానికి హాజరైన ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మున్నూరు బాల్ రాజ్ ఈ విషయాన్ని తెలిపారు. ఈ సందర్భంగా రఘువీర వర్మ మాట్లాడుతూ పార్టీ పట్టిష్టతకు తనవంతు కృషి చేస్తానన్నారు. తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానన్నారు. తనను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు పార్టీ నిర్వాహకుడు తీన్మార్ మల్లన్న తో పాటు రాష్ట్ర అధ్యక్షుడికి రఘువీర వర్మ కృతజ్ఞతలు తెలిపారు.

# గిన్నిస్ విజేతలను ప్రోత్సహించాలి

■ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
■ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ విజేతలకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా సన్మానం
■ నాచారం టీంమాస్టర్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిభ చాటిన విద్యార్థులు
■ బి. మోహన్ కుమారుడు బి. రాము సహా పలువురికి సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం
■ ప్రపంచ స్థాయిలో రాణిస్తున్న యువతను ప్రభుత్వం ప్రోత్సహించాలంటూ ఎమ్మెల్యే డిమాండ్



జయభేరి, హైదరాబాద్ :
ప్రపంచ స్థాయిలో తెలంగాణ ప్రతిష్ఠను చాటిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ విజేతలను ప్రభుత్వం గుర్తించి తగిన ప్రోత్సాహకాలు అందించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ కార్యక్రమంలో విజయం సాధించిన విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేసి అభినందించారు. ఈ ఏడాది ఏప్రిల్ 26న హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ కార్యక్రమంలో నాచారం టీం మాస్టర్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బి.మోహన్ కుమారుడు బి.రాము బి.గట్టు, బి.భరత్, బి.చెన్నమ్మ, జే.కృత్విక్, బి.యక్షిత్ వర్ధన్, శివచరణ్, శివకుమార్, మాణితేజ ఈ పోటీల్లో పాల్గొని విజయాన్ని నమోదు చేశారు.
కార్యక్రమం అనంతరం 45 రోజుల తర్వాత వారికి గిన్నిస్ రికార్డ్ సర్టిఫికెట్లు, మెడల్స్ అందాయి. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేసి ఘనంగా సన్మానించారు. ప్రపంచ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తీసుకొస్తున్న యువతను ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించి నగదు ప్రోత్సాహకాలు, అవార్డులు, శిక్షణ అవకాశాలు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ వేదికలపై రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్న ఇలాంటి ప్రతిభావంతులను ప్రోత్సహించడం ద్వారా మరింత మంది యువతలో స్ఫూర్తి నింపవచ్చని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

# చిలకనగర్ లో డ్రైనేజీ, రోడ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

■ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాకి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినతి



జయభేరి, ఉప్పల్ :
ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాని కలిసి నియోజకవర్గంలోని పలు ప్రజా సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా చిలకనగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్, అభయాంజనేయ స్వామి గుట్ట, మైసమ్మ గుడి ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు, డ్రైనేజీ నీటి అవుట్ లెట్ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే చిలకనగర్ చౌరస్తాలోని హనుమాన్ ఆలయం నుంచి మైసమ్మ గుడి వరకు రోడ్డు పనులకు ఇప్పటికే ఆమోదం లభించినప్పటికీ, మధ్య వరకు మాత్రమే రోడ్డు వేసి మిగిలిన భాగాన్ని తవ్వి వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చిలకనగర్ డివిజన్‌లోని డ్రైనేజీ, వర్షపు నీటి అవుట్‌లెట్ సమస్యలతో పాటు హనుమాన్ ఆలయం నుంచి మైసమ్మ గుడి వరకు అసంపూర్తిగా ఉన్న రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాని కలిసి వినతిపత్రం అందజేశారు. త్వరలో బోనాల పండుగ నేపథ్యంలో పోచమ్మ, మైసమ్మ ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, రహదారి పనులను తక్షణమే పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ రాధిక గుప్తాకి తెలిపారు. బోనాల పండుగ దృష్ట్యా భక్తులు, స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని.. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిలుకానగర్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుడి మధుసూదన్ రెడ్డి, ఈరెల్లి రవీందర్ రెడ్డి, చేర్యాల శ్రీనివాస్, గడ్డం పాపిరెడ్డి పాల్గొన్నారు.

# దేశరాజుపల్లిలో డంపింగ్ యార్డు వద్దు

■ జై భీం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా



జయభేరి, కరీంనగర్, జూలై 20 :
కొత్తపల్లి మండలంలోని దేశరాజుపల్లి గ్రామంలో డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా సోమవారం జై భీం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా. కార్యక్రమం నిర్వహించారు. కొత్తపల్లి మున్సిపాలిటీకి చెందిన చెత్త వాహనాలు ప్రతిరోజూ గ్రామంలోని డంపింగ్ యార్డులో చెత్తను వేయడం వల్ల దుర్వాసన, కాలుష్యం ఏర్పడి చుట్టుపక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు.ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే గ్రామంలో చెత్త డంపింగ్ నిలిపి వేసి ప్రజలకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎల్లపెల్లి లచ్చయ్య, ఉపసర్పంచ్ ఎం.డి. హైదర్, వార్డు సభ్యులు, జై భీం యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తూరి అరవింద్, గ్రామ యువకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## బస్తీ దవాఖానల మంజూరు కోసం..

■ తెలంగాణ ఆరోగ్య & కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జయభేరి, ఉప్పల్ :
ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలంగాణ ఆరోగ్య & కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ (Director, Health & Family Welfare) సంగీత సత్యనారాయణని మర్యాదపూర్వకంగా కలిసి, నియోజకవర్గంలో కొత్త బస్తీ దవాఖానలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గంలో వేగంగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రాథమిక ఆరోగ్య సేవలను మరింత విస్తరించాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రజలకు వారి నివాస ప్రాంతాలకు సమీపంలోనే నాణ్యమైన వైద్య సేవలు, ఉచిత మందులు, అవసరమైన వైద్య పరీక్షలు అందుబాటులో ఉండేలా అదనపు బస్తీ దవాఖానలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ వినతిపై ఆరోగ్య శాఖ డైరెక్టర్ గారు సానుకూలంగా స్పందించి, ప్రతిపాదనను పరిశీలించి ప్రభుత్వానికి నివేదించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన ప్రతి అంశంపై ప్రభుత్వం దృష్టి సారించేలా నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు.

## ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు

■ ఉప్పల్ కాలభైరవ స్వామి దేవాలయంలో వారాహి పూజ, అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



జయభేరి, ఉప్పల్ :
ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రసిద్ధ శ్రీ కాలభైరవ స్వామి దేవాలయంలో నిర్వహించిన పవిత్ర శ్రీ వారాహి అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమం, అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని భగవంతుడిని కోరడం జరిగింది. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని అందజేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు గుండ మల్లయ్య, ఆలయ కమిటీ సభ్యులు, BRS పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తా..

ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవ



జయభేరి, ఉప్పల్ :
ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంలో తాగునీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థల దుస్థితిపై ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (HMWSSB) ED పంకజని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బగాయత్ లోని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. నియోజకవర్గంలో అత్యవసరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే ఆమోదించి, ప్రాధాన్యత ప్రాతిపదికన నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా, సక్రమమైన మురుగు నీటి పారుదల సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

## ఎమ్మెల్యేతో కాసేపు సరదాగా..



జయభేరి, దేవరకద్ర :
మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) తో సోమవారం చిన్నారులు కాసేపు సరదాగా గడిపారు. కౌకుంట్ల మండలం ఇస్రంపల్లి లో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్ తో అక్కడున్న కొంతమంది చిన్నారులు ఎమ్మెల్యే వద్దకు వచ్చి పక్కనే కాసేపు కూర్చొని సరదాగా గడిపారు. ఎమ్మెల్యే పక్కన తాము కూర్చోవడంతో వారి సంతోషానికి అవధులు లేకుండా పోయింది. వారికి తగ్గట్టు ఎమ్మెల్యే జిఎంఆర్ కూడా వారితో కాసేపు చనువుగా ఉన్నారు. వారికి కుశల ప్రశ్నలు వేశారు. ఈ దృశ్యం గ్రామస్తులను ఎంతగానో ఆకట్టుకుంది.



## మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్య గౌడ్ ఘనంగా జన్మదిన వేడుకలు

జయభేరి, యాదగిరిగుట్ట, జులై 20 :

ఆలేరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత బూడిద భిక్షమయ్యగౌడ్ జన్మదిన వేడుకలు యాదగిరిగుట్టలో ఘనంగా జరిగాయి. సోమవారం స్థానిక బీఆర్ఎస్ నేతలు, పలువురు ప్రముఖులు యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కొండ కింద పాదాల దగ్గర కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎనిమిది వార్డు కౌన్సిలర్ పేరబోయిన సత్యనారాయణ, బిఆర్ఎస్ పార్టీ నేతలు తంగళ్లపల్లి సుగుణాకర్, పాపట్ల నరహరి, గడ్డం చంద్రంగౌడ్, మిట్ట వెంకటయ్య, కసావు శ్రీనివాస్, గునగంటి బాబురావు, మొగిలి పాక రమేష్, ముక్కెర్ల సతీష్, భీమగాని నర్సింహ్మ, దేవపూజ అశోక్, శ్రీను, భక్త కన్నప్ప, పబ్బాల సాయి, కొన్యాల నర్సింహ్మ, గ్యాదపాక క్రాంతి, ర్యాకల రాజు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్టలో శాస్త్రోక్తంగా వరుణ యాగం



జయభేరి, యాదగిరిగుట్ట, జులై 20 :

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి కొండపైన కొలువైన శ్రీపర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ఘనంగా వర్ష పాశుపతి వరుణ యాగంను నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో తీవ్రమైన అనావృష్టి నెలకొని వర్షాలు పడడం లేదని,ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రమంతా సస్యశ్యామలమై పాడి పంటలతో విలసిల్లాలనే సంకల్పంతో వరుణయాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురిసి పాడి పంటలు బాగా పండాలని,ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ప్రపంచ శాంతికై యాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరుణయాగంలో భాగంగా తొలి రోజు గణపతి పూజా, పుణ్యాహవాచనం, రక్షాబంధనం,అఖండ దీపారాధన,పంచగవ్య ప్రాసనము నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వరుణ యాగం విశిష్టతను భక్తులకు అర్చకులు వివరించారు. అనంతరం యాగంలో భక్తులు పాల్గొని వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కౌన్సిలర్ అరుణ చంద్రమౌళి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే జిఎంఆర్



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం దేవరకద్ర మున్సిపాలిటీ 10వ వార్డ్ కౌన్సిలర్ అరుణ చంద్రమౌళి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సోమవారం పరామర్శించారు. కౌన్సిలర్ అరుణ చంద్రమౌళి తండ్రి పుట్ట బాలప్ప అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్ బలుసుపల్లి గ్రామానికి వచ్చి మృతుడి భౌతిక దేహం పై పూలమాలవేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టి పి సి సి ఆర్గనైజేషన్ కార్యదర్శి కొత్త అరవింద్ కుమార్ రెడ్డి దేవరకద్ర మున్సిపాలిటీ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగేంధర్ రెడ్డి, కోన రాజశేఖర్, కురుమ రాంపండు,అంజిల్ రెడ్డిలతోపాటు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దేవరకద్ర పూజలో ఎమ్మెల్యే



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని శివాలయంలో సోమవారం వర్షం కోసం నిర్వహించిన పూజా కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పాల్గొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలంటూ ఈ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన పలు పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్ కు నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగేంధర్ రెడ్డి, దేవస్థానం శివానంద చారి, మాజీ జెడ్పిటిసి లక్ష్మీకాంతరెడ్డి లతోపాటు దేవాలయ పురోహితులు, మున్సిపాలిటీ కౌన్సిలర్లు, భక్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భూభారతిపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంత రావు,ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ

జయభేరి, యాదగిరిగుట్ట, జులై 20 :




భూభారతి చట్టం ప్రకారం సమగ్ర సర్వే నిర్వహించి శాశ్వత భూ ఆధార్ కార్డును ఇవ్వాలని,భూమి హక్కులను కాపాడేందుకు భూ భారతి చట్టంలో చేయాల్సిన చేర్పులు,మార్పులపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షు బాగం హేమంతరావు,ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట పట్టణంలోని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూభారతి చట్టం అమలును కేవలం పైలట్ ప్రాజెక్టులకే పరిమితం చేయొద్దని,సమగ్ర భూ సర్వే చేపట్టి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని కోరారు. అమెరికాభారత్ వాణిజ్య ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఆ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఒప్పందానికి వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) పిలుపులో భాగంగా ఈ నెల 22న తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని మోదీల దిష్టిబొమ్మలను దగ్ధం చేయాలని పిలుపునిచ్చారు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను పూర్తిగా ఎత్తివేస్తే దేశీయ రైతాంగం కోలుకోలేని దెబ్బతింటుందన్నారు. ఈ ఒప్పందాన్ని వెనక్కి తీసుకునే వరకు ఢిల్లీ నుంచి గల్లీ దాకా పోరాటం కొనసాగిస్తామని, భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకు ఈ నెల 28, 29 తేదీల్లో జాతీయ స్థాయిలో ఎస్కేఎం ఆధ్వర్యంలో రైతు, కార్మిక సంఘాలతో సంయుక్త కన్వెన్షన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న విద్యావేత్త, పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ పోరాటానికి సంఘీభావం తెలియజేస్తూ తీర్మానం చేశారు. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు దీక్ష చేస్తున్న ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు హెల్త్ బులెటిన్లు విడుదల చేయాలని కోరారు. ఈ శిక్షణా శిబిరంలో తెలంగాణ రాష్ట్ర నాయకులు గోదా శ్రీరాములు, కొల్లూరి రాజయ్య, దొడ్డ వెంకటయ్య, డి.జి.నరేందర్ ప్రసాద్, ఎం.ప్రభులింగం, కొండపర్తి గోవిందరాజు, వర్ల వెంకటయ్య, కంజర భూమయ్య, నర్ల వెంకటయ్య, ఏశాల అశోక్, లక్ష్మయ్య, ఎస్.రవి, దొండపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల కష్ట సుఖాల్లో టిఆర్ పి నాయకులు భాగస్వాములు కావాలి

- టిఆర్ పి జిల్లా ప్రధాన కార్యదర్శి రఘువీర వర్మ ముదిరాజ్

జయభేరి, దేవరకద్ర :



ప్రజల కష్ట సుఖాల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టి ఆర్ పి) నాయకులు భాగస్వాములు కావాలని ఆ పార్టీ పాలమూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రఘువీర వర్మ ముదిరాజ్ అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో సోమవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మున్నూరు జైపాల్ ఆధ్వర్యంలో దేవరకద్ర నియోజకవర్గంలోని ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, వివిధ విభాగాల అధ్యక్షులు, ఎస్సీ, మైనార్టీ సెల్ కార్యవర్గాల నియామక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ఉద్దేశించి వర్మ ముదిరాజ్ ప్రసంగించారు. నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఆయన మండల అధ్యక్షులను ఉద్దేశించి అన్నారు. పార్టీ బోలోపేతానికి తమ వంతు కృషి చేయాలన్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములు కావడంతో పాటు అవినీతిని అంతం చేసే దిశగా తమ కార్యాచరణను రూపొందిం చాలన్నారు. తమ పార్టీ ముఖ్య ఉద్దేశం కూడా అదే అన్న విషయం ప్రతి ఒక్కరు గ్రహించాలన్నారు. ఈ సందర్భంగా దేవరకద్ర మండల పార్టీ అధ్యక్షుడిగా వడ్ల చంద్రమౌళిని నియమించారు. అలాగే చిన్న చింతకుంట మండల అధ్యక్షుడిగా నరేందర్, మదనాపురం అధ్యక్షుడిగా బంగ్లా కృష్ణయ్య, మూసాపేట అధ్యక్షుడిగా బోయ నర్సింహలతోపాటు మైనార్టీ సెల్ నియోజకవర్గం కన్వీనర్ గా ఎండి జావిద్, చిన్న చింతకుంట మండలం మైనార్టీ అధ్యక్షుడిగా మహమ్మద్, నియోజకవర్గం ఎస్సీ సెల్ కన్వీనర్ గా దొబ్బలి చుక్కల రాయుడు, దేవరకద్ర ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా బాలరాజు, దేవరకద్ర మండల యువజన అధ్యక్షుడిగా పి. మహేష్‌గౌడ్, కార్యదర్శిగా పి.రవి, దేవరకద్ర పట్టణ అధ్యక్షుడిగా నట్టలి నిరంజన్, మున్సిపాలిటీ అధ్యక్షుడిగా బోయ కురుమూర్తి లను ఏకగ్రీవంగా నియమించారు.

## ఏల్ నీనోను ఎదుర్కోవడానికి రైతులకు అధికారులు అవగాహన కల్పించాలి

- పాలమూరు జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ
- మహబూబ్ నగర్ లో ఎల్ నీనో పై సమీక్ష సమావేశం

జయభేరి, దేవరకద్ర :





ఎల్ నినో ను ఎదుర్కోవడానికి రైతులకు అధికారులు సరైన అవగాహన కల్పించాలని మహబూబ్ నగర్ జిల్లా ఇన్చార్జి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్ లో సోమవారం జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్త అధ్యక్షతన మరియు సీజనల్ కండిషన్స్, వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్చార్జి మంత్రితో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమీక్ష సమావేశాన్ని ఉద్దేశించి జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ ప్రసంగించారు. ఎల్ ని నో ను సమర్ధవంతంగా ఎదుర్కొందా మన్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రతి శాఖ ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని మంత్రి కోరారు. ఈ విషయంలో రైతులు ప్రత్యామ్నాయ చర్యలను వెంటనే చేపట్టాలన్నారు. ఈ విషయంలో రైతులకు వ్యవసాయ శాఖ తగు సూచనలు, సలహాలను వెంటనే అందజేయాలన్నారు. అనంతరం ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, ఎల్ నినో ఎక్స్పర్ట్ కమిటీ చైర్మన్ జి. చిన్నారెడ్డి ప్రసంగించారు. ఎల్ నినో కారణంగా వ్యవసాయ పనులు లేక గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు లేక చాలామంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు తగ్గకుండా ఉపాధి హామీ పథకం కింద పెద్ద ఎత్తున పనులు చేపట్టాలని, అవసరమైతే సాధారణ పరిస్థితుల కంటే ఎక్కువ రోజులు ఉపాధి కల్పించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు ఆయన సూచించారు. అలాగే సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ..ఎల్ నినో పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించాలని, ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. భూత్పూర్ మండలంలోని షేర్ పల్లి గ్రామంలో ఈ సారి రైతులు ఎల్ నినో పరిస్థితులపై అప్రమత్తమై, హార్టికల్చర్ పంటలు వేశారన్నారు.అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులు సమన్వయంతో పని చేస్తూ రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించాలని కోరారు. అధికారులు గ్రౌండ్ వాటర్ కు సంబంధించిన నివేదికలను కలెక్టరేట్ వరకే పరిమితం చేయకుండా, మండల, గ్రామస్థాయి రైతులకు తెలియజేసి, వారికి అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే జీఎంఆర్ కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## "సర్" ప్రక్రియ మనందరి బాధ్యత..!

జయభేరి, ఉప్పల్ :

అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు జాబితా తొలగించకుండా చూడాలని పలువురు కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. బీఎల్ఓలతో మన పార్టీ బీఎల్ఏలు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగేలా నాయకులు చూడాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఉప్పల్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, డివిజన్ కో ఆర్డినేటర్లు, బూత్ కో ఆర్డినేటర్లతో "సర్" ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పార్లమెంట్ కోర్డినేటర్ సుబ్రహ్మణ్యం, ఉప్పల్ కోర్డినేటర్ వరలక్ష్మి, జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి హాజరై మాట్లాడారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగిపోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎస్ఐఆర్ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం ఉండొద్దన్నారు. దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, మహిళలు, వలస కార్మికుల ఓట్లు తొలగిపోయే ప్రమాదం ఉందన్నారు. కాంగ్రెస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ఎస్ఐఆర్‌పై అవగాహన సమావేశాలు నిర్వహించి, ఓటర్లకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. క్లస్టర్ స్థాయిలో సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకునేలా చూడాలన్నారు.



## సీనియర్ న్యాయవాది మెరుగు రవీందర్ మృతి

- నివాళులార్పించిన బార్ అసోసియేషన్
- సంతాపసభ ఏర్పాటు చేసి మౌనం పాటించిన బార్ అసోసియేషన్ సభ్యులు

జయభేరి, పరకాల, జులై 20:

శుక్రవారం పరకాల పట్టణంలో అకాల మరణం చెందిన విషయము అత్యంత విషాదకరమని పేర్కొంటూ ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పరకాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతాప సభ ఏర్పాటు చేయడం జరిగింది. సంతాప సభలో న్యాయవాదులు మెరుగు రవీందర్ న్యాయవృత్తి సేవలు స్మరించుకొని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పరకాల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కూకట్ల శ్రీనివాస్, పి వెంకటరమణ, జనరల్ సెక్రెటరీ పెద్ద బోయిన వేణు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మాజీ ఏ జి పి లక్కం శంకర్, ట్రెజరర్ గూడెల్లి రాహుల్ విక్రమ్, సీనియర్ ఈసీ మెంబర్ వి చంద్రమౌళి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎన్ పవన్, సీనియర్ న్యాయవాదులు జి జగదీశ్వర్, గండ్ర నరేష్ రెడ్డి, ఒంటె రాజమౌళి, మేకల శ్రావణ్ కుమార్, దొగ్గల రమేష్, టి సురేష్, చంద్రమోహన్, సృజన్, ఎండి షాబీర్, సుజయ్ రానా, జంగిలి రాజు, భార్గవి, రాజు చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## "సర్" ప్రక్రియ సాఫీగా సాగేలా సహాయ కేంద్రాలు పని చేయాలి..!

- కాంగ్రెస్ శ్రేణులకు మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి పిలుపు




జయభేరి, ఉప్పల్ :

సర్ ప్రక్రియ సాఫీగా, వేగవంతంగా సాగేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పని చేయాలని ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ ఇందిర నగర్ కాలనీ వద్ద కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఈగ ఆంజనేయులు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్ సహాయ కేంద్రాన్ని ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. నిజమైన ఓటర్లకు సర్ ప్రక్రియతో ఎలాంటి నష్టం లేకుండా చూడాలని ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి అన్నారు. బీఎల్ఓతో సమన్వయం చేసుకుంటూ ఓటర్లకు సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఈగ ఆంజనేయులు ముదిరాజ్, బాకారం లక్ష్మణ్, లింగంపల్లి రామకృష్ణ, సల్ల ప్రభాకర్ రెడ్డి అలుగుల అనిల్, వెంకట్ రెడ్డి, తొకట రాజు, గొరిగె మహేష్, సిల్వేరు ప్రేమ్ కుమార్, బాకారం అరుణ్, నగరం వెంకట్, మండలం నాగరాజు, ప్రశాంత్ రెడ్డి, సల్ల అంజి, జంగయ్య, మరియు ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# త్రిపుర డీజీపీ ఆత్మహత్య



జయభేరి, అగర్తలా, జూలై 20 :

త్రిపుర రాష్ట్రంలో షాకింగ్ ఘటన వెలుగు చూసింది. రాష్ట్ర డీజీపీగా విధులు నిర్వహిస్తున్న అనురాగ్ ధన్కడ్ ఆత్మహత్య చేసుకొని ప్రాణాలు కోల్పోయారు. అగర్తలాలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయన ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.త్రిపుర రాష్ట్రంలో సోమవారం ఉదయం ఒక షాకింగ్ ఘటన వెలుగు చూసింది. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా విధులు నిర్వహిస్తున్న సీనియర్ ఐపీఎస్ అధికారి అనురాగ్ ధన్కడ్ ఆత్మహత్య చేసుకొని ప్రాణాలు కోల్పోయారు. అగర్తలాలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయన ఉరివేసుకోని ఈ ఘాతుకానికి పాల్పడినట్టు తెలుస్తోంది. అయితే ఘటన జరిగిన వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు.. అక్కడికి చేరుకొని ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అగర్తలాలోని జీబీ ఆసుపత్రికి తరలించారు.రాష్ట్ర అత్యున్నత పోలీసు అధికారి ఇలా ఆకస్మికంగా, విషాదకర రీతిలో మరణించడం త్రిపుర పరిపాలన, శాంతిభద్రతల వర్గాల్లో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించడంతో. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. అనురాగ్ ధన్కడ్ ఆత్మహత్యకు గల తక్షణ కారణాలపై ఆరా తీస్తున్నారు. అలాగే సీనియర్ ఐపీఎస్ అధికారి మరణానికి దారితీసిన పరిస్థితులను నిర్ధారించడానికి ప్రభుత్వం త్వరలోనే ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా త్రిపుర కేడర్‌కు చెందిన 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన అనురాగ్ ధంకర్, 2025 మే నెలలో త్రిపుర డీజీపీ బాధ్యతలు స్వీకరించారు. పోలీస్ కార్యాలయంలో రక్తసిక్తమైన స్థితిలో ఉన్న ధంకర్‌ను వెంటనే తీవ్ర గాయాలతో అగర్తలాలోని గోవింద్ వల్లభ్ పంత్ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రికి తీసుకువచ్చే సమయానికే ఆయనలో ప్రాణం లేదని వైద్యులు ధృవీకరించారు. మధ్యాహ్నం 12 గంటల సమయానికి ఆయనను అత్యవసర విభాగానికి తీసుకువచ్చారని, పల్స్, బీపీ ఏమీ లేకపోవడంతో సుమారు 40 నిమిషాల పాటు సీపీఆర్ ఇచ్చి కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయిందని, మధ్యాహ్నం 12:48 గంటలకు ఆయన మృతి చెందినట్లు అధికారికంగా ప్రకటించామని డాక్టర్ ప్రదీప్ భౌమిక్ వెల్లడించారు. పోస్ట్‌మార్టం నివేదిక వచ్చిన తర్వాతే మరణానికి గల ఖచ్చితమైన కారణాలు తెలుస్తాయని పేర్కొన్నారు.మచ్చలేని సుదీర్ఘ కెరీర్ ఉన్న ఒక అత్యున్నత స్థాయి అధికారి హెడ్‌క్వార్టర్స్‌లోనే తన ప్రాణాలు తీసుకునేంత తీవ్ర నిర్ణయం ఎందుకు తీసుకున్నారనేది ఇప్పుడు సమాధానం లేని ప్రశ్నగా మారింది. ఘటన స్థలాన్ని సీజ్ చేసిన పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లోనూ దర్యాప్తు ప్రారంభించారు. ఆయన వ్యక్తిగత జీవితంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా, లేదా వృత్తిపరమైన ఒత్తిళ్లు ఏమైనా కారణమయ్యాయా అనే అంశాలపై ప్రత్యేక బృందాలు విచారణ జరుపుతున్నాయి. సీఎం మాణిక్ సాహా, ఇతర ప్రభుత్వ పెద్దలు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆసుపత్రికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనురాగ్ ధంకర్ 1994 బ్యాచ్ త్రిపుర క్యాడర్ ఐపీఎస్ అధికారిగా దేశ రాజకీయ, దర్యాప్తు వర్గాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు. మే 2025లో అమితాభ్ రంజన్ స్థానంలో త్రిపుర డీజీపీగా బాధ్యతలు స్వీకరించడానికి ముందు, ఆయన త్రిపురలోనే డీజీపీ ఇంటెలిజెన్స్) గా బాధ్యతలు నిర్వహించారు. అంతేకాకుండా తన కెరీర్‌లో కేంద్ర దర్యాప్తు సంస్థ లో సుదీర్ఘకాలం పనిచేస్తూ పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆర్థిక కుంభకోణంలో నీరవ్ మోదీ కేసుతో పాటు 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల దర్యాప్తుకు సంబంధించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ కి కూడా నాయకత్వం వహించిన గొప్ప అనుభవం ఆయనకుంది. అత్యంత సమర్థుడైన ఐపీఎస్ ఆఫీసర్‌గా, క్లిష్టమైన కేసులను ఛేదించిన నిపుణుడిగా పేరున్న అనురాగ్ ధంకర్ హఠాన్మరణం త్రిపుర పోలీస్ వర్గాలను, కేంద్ర హోం మంత్రిత్వ శాఖను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. దశాబ్దాల కాలం పాటు చట్టం, భద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించిన ఒక డీజీపీ స్థాయి ఆఫీసర్ ఇలా ఆత్మహత్యకు పాల్పడటం భారతీయ పోలీస్ వ్యవస్థల్లో మానసిక ఒత్తిడి, వ్యక్తిగత సమస్యలపై సరికొత్త చర్చకు దారితీస్తోంది. దర్యాప్తు నివేదికల అనంతరం మాత్రమే ఈ దారుణ ఘటన వెనుక ఉన్న పూర్తి నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



## వర్షంలో ఎమ్మెల్యే జిఎంఆర్ పర్యటన

జయభేరి, దేవరకద్ర :

వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సోమవారం పర్యటించారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కౌకుంట్ల మండలం ఇస్రంపల్లిలో సోమవారం సాయంత్రం గ్రామానికి చెందిన చందా హుస్సేన్ కు చెందిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే జీఎంఆర్ హాజరయ్యారు. అనంతరం ఇందిరమ్మ ఇంటి యజమానులకు తమ కుటుంబం తరపున నూతన వస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే జిఎంఆర్ కు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. వర్షం ఉన్నప్పటికీ గొడుగు పట్టుకుని ఎమ్మెల్యే జిఎంఆర్ ఎంతో ఓపికతో గ్రామంలో పర్యటించారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రశాంతతకు చిరునామా.. ఆధ్యాత్మికత..


- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్
- వీరప్పయ్య స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్



జయభేరి, దేవరకద్ర :

ప్రశాంతతకు చిరునామా.. ఆధ్యాత్మికత అని.. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి జిఎంఆర్ అన్నారు. దేవరకద్రలో లో కొలువుదీరిన, పట్టణ ప్రజల ఆరాధ్య దైవమైన శ్రీ సద్గురు ఈశ్వర వీరప్పయ్య స్వామి వారిని దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో స్వామివారికి సాంప్రదాయ రీతిలో జరిగిన ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. దేవాలయానికి వచ్చిన ఎమ్మెల్యే జిఎంఆర్ కు దేవస్థానం నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఆయనపై అక్షింతలు చల్లి పురోహితులు ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వచనం పలికారు. ఈ సందర్భంగా అక్కడ ఎమ్మెల్యే జిఎంఆర్ గోమాతలకు కూడా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగేందర్ రెడ్డి, మాజీ జడ్పిటిసి లక్ష్మీకాంత్ రెడ్డి, దేవస్థానం ఈఓ శివానంద చారి లతోపాటు కౌన్సిలర్లు, భక్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పరవాడ జగనన్న కాలనీలో వీధిలైట్లు వెలగక ప్రజల తీవ్ర ఇబ్బందులు



జయభేరి, పరవాడ:

అనకాపల్లి జిల్లా పరవాడ మండలం పరవాడ గ్రామంలో జగనన్న కాలనీలో గత కొన్ని రోజులుగా వీధిలైట్లు వెలగకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో కాలనీలో చీకటి నెలకొనడంతో మహిళలు, విద్యార్థులు,వృద్ధులు బయటకు రావడానికి భయపడుతున్నారు.చీకటి కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో పాటు, అసాంఘిక కార్యకలాపాలు పెరిగే ప్రమాదం ఉందని కొండ ప్రాంతం కావడంతో పాములు సచరిస్తున్నాయని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని వారు చెబుతున్నారు.వెంటనే వీధిలైట్లను మరమ్మతు చేసి, కాలనీలో తగిన వెలుతురు ఏర్పాటు చేయాలని స్థానికులు విద్యుత్ శాఖ మరియు పంచాయతీ అధికారులను కోరుతున్నారు.

## తెలంగాణ హై కోర్టు న్యాయవాదికి సన్మానం

జయభేరి, జయశంకర్ భూపాలపల్లి :

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబటి పల్లి గ్రామానికి చెందిన ముల్కల రాజయ్య యాదవ్ కుమార్తె. రజిత యాదవ్ న్యాయశాస్త్రంలో ఉత్తీర్ణులు అయి హై కోర్టులో న్యాయవాది గా సభ్యత్వం పొందిన సందర్భంగా సోమవారం అఖిలభారత యాదవ సంఘం కాటారం డివిజన్ అధ్యక్షులు ఆత్మకూరి స్వామి యాదవ్ ఆధ్వర్యంలో రజిత యాదవ్ ను ఘనంగా సన్మాణించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమములో మలహర్ మండల మాజీ ఎంపీపీ యాదండ్ల రామన్న యాదవ్ కాటారం డివిజన్ ఉపాధ్యక్షులు కొడాలి చిన్న మల్లయ్య యాదవ్ మహాదేవపూర్ మండల మాజీ అధ్యక్షులు కన్నెబోయిన ఐలయ్య యాదవ్ మరియు మరియు సీనియర్ విలేకరి లచ్చన్న యాదవ్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలపారు.




## నీట్ ప్రశ్న పత్రాల లీక్ కారణమైన కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి

జయభేరి, పరవాడ:

విద్యావేత్త సోనమ్ వాంగ్ చుక్ గత 20 రోజులుగా ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు సమస్యను పరిష్కరించకుండా ఢిల్లీ పోలీసులు నిరాహార దీక్షను భగ్నం చేయడం దుర్మార్గం అని సోమవారం దేశవ్యాప్తంగా ప్రజా సంఘాలు, అభ్యుదయ వాదులు పిలుపునిచ్చారు. అందులో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో లంకెలపాలెం జంక్షన్ లో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఫార్మాసిటీ స్టాప్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు గౌరవ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని పేపర్ లీక్ విషయంలో విద్యార్థులు మనస్థాపానికి గురై ఆత్మహత్యలకు పాల్పడ్డారని వీరి కుటుంబాలకి న్యాయం చేయాలని ఆమరణ దీక్ష చేస్తున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు సరి కదా సమస్యను జటిలం చేస్తున్నది. శాంతియుత ఆమరణ దీక్ష చేస్తున్న సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్ అక్రమంగా అరెస్ట్ చెయ్యడం అన్యాయంఅన్నారు. సమస్యను పరిష్కరించాలని లేదంటే పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి ఆందోళన పోరాటం నిర్వహిస్తామని గని శెట్టి హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అప్పారావు, నూకరాజు, కనకారావు, తదితరులు పాల్గొన్నారు.

## పరవాడ ఉటగడ్డ సమీపంలో రోడ్డు ప్రమాదం వ్యక్తికి తీవ్ర గాయాలు

- కారు డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణం అంటున్న పోలీస్ శాఖ




జయభేరి, పరవాడ:

పరవాడ గ్రామం ఊటగెడ్డ సమీపంలో సోమవారం ఉదయం నేవల్ ఆర్మమెంట్ డిపోలో సీనియర్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ. శ్రీనివాసరావు విధులకు వెళ్లేందుకు కంపెనీ కారులో ప్రయాణిస్తుండగా పరవాడ నుండి అచ్యుతాపురం రోడ్డులో ఉటగడ్డ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది.కారు డ్రైవర్ వాహనాన్ని అతివేగంగా నిర్లక్ష్యంగా నడుపుతూ ముందుగా వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది ఈ ప్రమాదంలో శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి తరలించి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదం కారణంగా ఆ రహదారి అంతా తీవ్రమైన ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు.ఈ ప్రమాదంలో శ్రీనివాసరావుకు గడ్డం వద్ద చీలిక గాయం ముందు పళ్లు దెబ్బతినడం దవడ ఎముక స్థానభ్రంశం ముఖం ఎడమ వైపు వాపు వంటి గాయాలు అయినట్లు వైద్యుల ప్రాథమిక పరీక్షలో గుర్తించారు.ఈ ఘటనపై బాధితుడి భార్య అన్నెపుల వసంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వరణుడా. కరుణించవా..!

- వర్షం కోసం అభిషేకం
- గర్భాలయ ద్వారానికి కట్టకట్టి బిందెలతో అభిషేకం
- శ్రీ రామలింగేశ్వర స్వామికి సహస్ర ఘటాభిషేకం
- హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్, తరలివచ్చిన భక్తులు




జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం వర్షం కోసం జలాభిషేకం పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ముందుగా గంగాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం గర్భాలయ ద్వారానికి కట్టకట్టి బిందెలతో ప్రత్యేక అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే సాంప్రదాయ రీతిలో స్వామివారికి వర్షం కోసం సహస్ర ఘటాభిషేకం ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని పురోహితులు నిర్వహించారు. చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా భక్తులంతా ఊరేగింపుగా అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ జలాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో స్థానిక శ్రీ రామలింగేశ్వర దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమానికి దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి తో పాటు మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, నాయకులు, యువకులు, మహిళలు, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తిశ్రద్ధలతో అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం ఈ పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొని తరించారు. వర్షాలు కురవాలని ఆ దేవదేవుడ్ని వేడుకొన్నారు.



## చలో మాల నల్లగొండ కలెక్టరేట్

- మాల మహానాడు దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బోయిని చంద్రమౌళి



జయభేరి, దేవరకొండ :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ఇచ్చిన గైడ్ లైన్స్ కు విరుద్ధంగా.. ఏంపరికల్ డాటా పరిగణలోకి తీసుకోకుండా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ 2011 జనాభా లెక్కల ప్రకారం ఆగస్టు 1 2024 న వర్గీకరణ చేసింది 2014 తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జన గణన చేయకుండా ఎస్సీ కులాలలో మాల జనాభాను తక్కువ చూయిస్తూ ఎస్సీ వర్గీకరణ చేసి 5 % కేటాయిస్తూ మాలలకు అన్యాయం చేసిందని అన్నారు. రోస్టర్ విధానాన్ని అమలు చేసిన విధానాన్ని ఖండిస్తూ బుధవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్లో లో బుధవారం జరిగే మాల మహానాడు రిలే నిరాహార దీక్షను చేపడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షులు తాళ్లపల్లి రవి పిలుపుమేరకు మద్దతుగా దేవరకొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల గ్రామాల నుండి మాల మేధావులు యువకులు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి రిలే నిరాహార దీక్షను విజయవంతం చేయాలని మాల మహానాడు దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బోయిని చంద్రమౌళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన తీరును నిరసిస్తూ అదేవిధంగా రోస్టర్ విధానంలో మాలలకు తీవ్ర నష్టము జరిగిందని అన్నారు రోస్టర్ విధానంపై జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో మాల మంత్రులు, ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులు అసెంబ్లీ సమావేశాల్లో రోస్టర్ విధానం పై చర్చ జరిపి మాలలకు న్యాయం జరిగే విధంగా రోస్టర్ విధానం పై 1 నుండి 16 లోపు రెండు రోస్టర్ పాయింట్లు వచ్చే విధంగా సవరణ చేయాలని పిలుపునిచ్చారు.

మాలలంతా ఏకతాటిపై వచ్చి కాంగ్రెస్ పార్టీకి సపోర్ట్ చేసి అధికారంలోకి రావడానికి కృషి చేసినప్పటికీ... కాంగ్రెస్ ప్రభుత్వం మాలలకు అన్యాయ చేయడం జరిగింది. అన్నారు రోస్టర్ విషయంలో ఎక్కడికక్కడ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని రోస్టర్ విధానాన్ని సవరణ చేయకపోతే వచ్చే ఎలక్షన్స్ లో మాలల పంతం కాంగ్రెస్ ప్రభుత్వం అంతం అనే నినాదంతో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఆనాడు పదవుల కోసం, పార్టీలకు వారసులం అనుకుంటే బాబాసాహెబ్ అంబేద్కర్... మనకు ఇన్ని హక్కులు సాధించేవారు కాదు... కేంద్ర న్యాయ శాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయాన్ని. మన ప్రజా ప్రతినిధులకు గుర్తులేదా .. అని రాబోయే రోజులలో విద్య ఉద్యోగ, అవకాశాలలో మాలలు మేలుకోకపోతే రాబోయే తరాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పిలుపునిచ్చారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణ అంటూ దుష్ప్రచారం

- డాక్యుమెంట్ రైటర్లకు ఉపాధి మార్గాలు చూపిస్తాం
- దీపం-2.0 లబ్ధిదారులకు నిర్ధారిత తేదీల్లో నగదు జమ
- ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు




**జయభేరి, అమరావతి, జులై 20:**
సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారంటూ కొందరు పని గట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని... దీనిపై వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్లో సోమవారం వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్షించారు.

**సేవల సులభతరానికే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు**

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారనే అంశం సమీక్షలో ప్రస్తావనకు వచ్చింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..."ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. రిజిస్ట్రేషన్ సేవలను మరింత సులభతరం చేసేలా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రంRSKలను ఏర్పాటు చేస్తున్నాం. ఇది ప్రైవేటీకరణ ఎంత మాత్రమూ కాదు. పాస్ పోర్టు సేవా కేంద్రాల తరహాలోనే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు పని చేస్తాయి. పాస్ పోర్టు సేవా కేంద్రాల పనితీరు ఏ విధంగా జరుగుతుందో... ఆ తర్వాత ప్రక్రియ ఏ విధంగా జరుగుతుందో వివరించండి. పాస్ పోర్టు సేవా కేంద్రాలు అందుబాటులోకి వచ్చాక పాస్ పోర్టు ప్రాసెసింగ్ అనేది చాలా సులువైంది. ఇదే తరహాలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల పనితీరు ఉంటుంది. అయితే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల విషయంలో కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజలకు వాస్తవాలు వివరించే బాధ్యతను అధికారులు తీసుకోవాలి. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల కలిగే లాభాలను వివరించాలి. అలాగే డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి ఇబ్బంది లేని విధంగా మార్గాలు చూపెడతాం. దీపం2.0 పథక లబ్ధిదారులకు ఇచ్చే సబ్సిడీని క్రమపద్ధతిలో ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఈ సబ్సిడీని నిర్ధారిత తేదీల్లో ఇచ్చే అంశాన్ని పరిశీలించాలి. ఈ అంశంపై పౌర సరఫరాల శాఖఆర్థిక శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలి. దీనికి సంబంధించిన సాంకేతిక అంశాలను పరిశీలించి అమలు చేయాలి"అని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

**లిటిగెంట్ పిటిషనర్లకు కౌన్సెలింగ్**

"లిటిగెంట్ పిటిషనర్లను ఏ విధంగా కట్టడి చేయాలి. ఎలాంటి ప్రజా ప్రయోజనం లేకుండా చేసే ఫిర్యాదుదారులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలి. రాష్ట్ర వ్యాప్తంగా 81 మంది లిటిగెంట్ పిటిషనర్లు ఉన్నట్టు గుర్తించాం. వీరు సరాసరి ఒక్కొక్కరు 246 పిటిషన్లు పెడుతున్నారు. వీరి వివరాలను జిల్లా కలెక్టర్లకు పంపించాలి. వారు పెట్టే అర్జీల్లో ప్రజా ప్రయోజనాలు ఉంటే వాటిని పరిశీలించాలి. ప్రభుత్వాన్ని, అధికారులను బద్నాం చేసే ఉద్దేశంతో పిటిషన్లు పెట్టే వారిని గుర్తించాలి. ఫిర్యాదుల పరిష్కారంలో ఆర్థికేతర సమస్యలను వెంటనే పరిష్కరించాలి. ప్రాధాన్యతల వారీగా ఆర్థిక సమస్యలను పరిష్కరిద్దాం. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం కారణంగా ప్రస్తుతం 49 శాతం లోటు వర్షపాతం ఉంది. ఈ ప్రభావం నుంచి బయటపడేసే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి. ఈ మేరకు రైతుల్లో అవగాహన కల్పించాలి. డ్రై క్రాప్స్ వేసేలా రైతులను ప్రోత్సహించండి. ఇదే సమయంలో వీబీ జీ రామ్ జీ పనులను పెద్ద ఎత్తున చేపట్టాలి. జలధార పనులకు వీబీ జీ రామ్ జీ పనుల్ని అనుసంధానం చేయాలి. ప్రజాభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పని విధానం మార్చుకోవాలి. పరిపాలనా విధానాలను మెరుగుపరుచుకోవాలి. సమస్యలు ఉత్పన్నమయ్యాక చర్యలు తీసుకోవడంతోపాటు... ముందుగానే ఏయే సమస్యలు వస్తాయనే విషయాన్ని అంచనా వేసి.. దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## బెల్టు షాపులు బంద్ చేయకుంటే 50,000 జరిమానా

**జయభేరి, తుర్కపల్లి, జూలై 20 :**
బెల్టు షాపులు బంద్ చేయకుంటే 50వేల రూపాయల జరిమానా విధిస్తామని సర్పంచ్ గుగులోతు ధూప్ సింగ్ నాయక్ అన్నారు. సోమవారం తుర్కపల్లి మండలం గుజ్జవానికుంట తండాలో గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం రహిత తండానిగా మార్చడమే తన లక్ష్యమని అన్నారు. ప్రజల ఆరోగ్యం కుటుంబాల సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తున్నట్టు తెలిపారు. గ్రామ అభివృద్ధి శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని తండాలో ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్టు తెలిపారు.

## ఎల్ నీనో ప్రభావం ఉండడంతో వర్షాలు అస్థిరంగా ఉంటాయి



**జయభేరి, తుర్కపల్లి, జూలై 20 :**
ఎల్ నీనో ప్రభావం ఉండడంతో వర్షాలు అస్థిరంగా ఉంటాయని ఇలాంటి పరిస్థితుల్లో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి కె. శ్రీ ఉమా అన్నారు. సోమవారం తుర్కపల్లి మండలం నాగాయపల్లి, గోపాలపురం గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతులకు వర్షాభావ పరిస్థితుల గురించి వివరించారు. ఎల్ నీనో ప్రభావంతో మన ప్రాంతాల్లో వర్షాభావం తగ్గే అవకాశం ఉంటుందని ఫలితంగా పంటల సాగు దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడుతుందని అన్నారు. వర్షాల పరిస్థితిని గమనిస్తూ పంటల సాగు చేపట్టాలని అన్నారు. వర్షాభావాన్ని తట్టుకునే పంటలు రకాలను ఎంపిక చేసుకోవాలని, నీటి ఎద్దడికి తట్టుకునే సజ్జలు, రాగులు, కందులు, మినుములు, ఆముదము పంటలు సాగు చేయాలని సూచించారు. రాగులు, సజ్జలు, ఆగస్టు 15 తేదీ వరకు విత్తుకోవచ్చు అని, కంది ఈనెల చివరి వరకు విత్తనాలను విత్తుకోవచ్చు అని, వీటికి అదనంగా పామాయిల్, మునుగా, కూరగాయలు సాగు చేయాలని తెలిపారు. వరి పంటలలో వర్షాభావ పరిస్థితుల వలన ఎర్రబడడం జరుగుతుందని దీనికి 19,19,19 లేదా మల్టీకే 13,0,45 ని లీటర్ నీటికి 5 నుండి 10 చొప్పున కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఇలా 15 రోజులు రెండుసార్లు చేస్తే పంట కోరుకుంటుందని అన్నారు.

## కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలాన్ని బహుకరించడం అభినందనీయం



**జయభేరి, తుర్కపల్లి, జూలై 20 :**
కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలాన్ని బహుకరించడం అభినందనీయమని గ్రామ సర్పంచ్ బొత్త రాములు అన్నారు. సోమవారం తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామంలో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి గ్రామానికి చెందిన జక్కుల యాదగిరి జ్ఞాపకార్థం మాజీ వైస్ ఎంపీపీ జక్కుల కలమ్మ కుమారులు జక్కుల శ్రీశైలం, కొమరయ్య, వెంకటేశం లు 100 గజాల స్థలాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బొత్త రాములు వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుమ్మడి బాలరాజు, గ్రామస్తులు జక్కుల కిష్టయ్య, పెద్ద గొల్ల లక్ష్మయ్య, కార్మికుల సత్యనారాయణ ,పాల సెంటర్ చైర్మన్ రాయన బోయిన వెంకటేష్, బుద్ధి శ్రీశైలం, సిరి గణేష్, బిక్షపతి, ఆలేటి ఆనంద్ ,ఆలేటి శ్రీశైలం, ఆవుల కృష్ణమూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీ కుంకుమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి దంపతులు




**జయభేరి, పరకాల, జులై 20:**
పరకాల పట్టణంలోని శ్రీ కుంకుమేశ్వరాలయంలో వారాహి దేవి నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన సామూహిక శ్రీ అనఘాష్టమి వ్రతం కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. అంతకముందు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు.

# పరకాలను అభివృద్ధి చేయడమంటే ప్రజలను ఆగం చేయడమా?

- గందె వెంకన్న, ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ అసోసియేషన్
- ముందస్తు సమాచారం లేకుండా దుకాణాల ముందు రేకుల షెడ్లను తొలగించడం పై వ్యాపారుల అసంతృప్తి





**జయభేరి, పరకాల, జులై 20:**
పరకాల పట్టణంలో మున్సిపాలిటీ అధికారులు చేపడుతున్న షాపుల ముందు రేకుల షెడ్ల తొలగింపు చర్యలపై వ్యాపారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పట్టణ అభివృద్ధి పేరుతో చిన్న వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదని పరకాల ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గందె వెంకటేశ్వర్లు అన్నారు. షాపుల ముందు ఎంత మేరకు షెడ్లు ఏర్పాటు చేసుకోవచ్చో ముందుగానే స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసి, వ్యాపారులకు తగిన గడువు ఇవ్వాల్సిందని ఆయన సూచించారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా పోలీసుల సమక్షంలో షెడ్లను తొలగించడం వల్ల చిన్నవ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రొక్లెయిన్లతో దుకాణాల ముందు ఉన్న సిమెంట్ కాంక్రీట్ నిర్మాణాలను తొలగించి, మట్టిని బయటకు తరలిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయని పేర్కొంటూ, ఆ మట్టిని ఎక్కడికి తరలిస్తున్నారు? అక్కడ చేపట్టబోయే అభివృద్ధి పనులు ఏమిటి? అనే అంశాలపై మున్సిపాలిటీ ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే వ్యాపారాలు మందగించి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న చిన్న వ్యాపారులకు మున్సిపాలిటీ చర్యలు మరింత భారంగా మారుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తవ్విన గుంతలను ఎప్పుడు పూడుస్తారు, ఆ ప్రాంతంలో చేపట్టబోయే అభివృద్ధి పనుల వివరాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. పట్టణ అభివృద్ధి ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలని, వ్యాపారుల జీవనోపాధికి భంగం కలగకుండా మున్సిపాలిటీ వ్యవహరించాలని గందె వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రజల నుంచి వస్తున్న ఆరోపణలు, సందేహాలపై మున్సిపాలిటీ అధికారులు అధికారికంగా స్పందించి వివరణ ఇవ్వాలని ఆయన కోరారు.

# భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కారమే ధ్యేయంగా..



**జయభేరి, శేరిలింగంపల్లి :**
ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మహంకాళి నగర్ చౌరస్తా నుండి తులసి వనం ఔట్ లెట్ వరకు రూ.48 లక్షల 65 వేల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ( UGD) పైప్ లైన్ నిర్మాణం పనులకు గౌరవ తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాస రావు, జలమండలి అధికారులతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేసిన PAC చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా PAC చైర్మన్ గాంధీ మాట్లాడుతూ.. భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం అని, పలు కాలనీ లలో ప్రజల నుండి వచ్చిన వినతి మెరకు మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవతో మహంకాళి నగర్ కాలనీలో రూ.48 లక్షల 65 వేలతో UGD నిర్మాణము పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని PAC చైర్మన్ గాంధీ తెలియచేసారు, అత్యవసరం ఉన్న చోట, నిత్యం పొంగుతున్న ప్రాంతలలో ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేస్తామని PAC చైర్మన్ గాంధీ తెలియచేశారు. ఏ చిన్న సమస్య అయిన నా దృష్టికి వచ్చిన తప్పకుండా పరిష్కరిస్తామని, కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ, కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతు సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీ లుగా తీర్చిదిద్దడమే నా ప్రథమ లక్ష్యం అని PAC చైర్మన్ గాంధీ తెలియచేసారు. కాలనీలలో గల ఎన్నో ఏండ్ల సమస్య నేటితో తిరునని, నిత్యం పొంగుతుండటం వలన కాలనీ వాసులు ,ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు అని వాటిని దృష్టిలో పెట్టుకొని UGD పైప్ లైన్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేయడం జరిగినది అని, అదేవిధంగా ప్రతి కాలనీలో స్వచ్ఛమైన మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం చేపట్టడం ద్వారా కాలనీ వాసులకు ప్రజలకు, స్వచ్ఛమైన మంచి నీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని PAC చైర్మన్ గాంధీ అన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని, UGD పైప్ లైన్ వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని, ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని PAC చైర్మన్ గాంధీ చెప్పడం జరిగినది. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని PAC చైర్మన్ గాంధీ అధికారులను ఆదేశించడం జరిగినది, నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని, మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని, అదేవిధంగా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని PAC చైర్మన్ గాంధీ తెలియచేసారు.

ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు GM హరిశంకర్, DGM శ్రీనివాస రాజు, మేనేజర్ అనిల్, నాయకులు, కార్యకర్తలు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు, స్థానికవాసులు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన రేషన్ డీలర్ల సంఘం

**జయభేరి, తుర్కపల్లి, జూలై 20 :**
తుర్కపల్లి మండలం ధర్మారం రేషన్ డీలర్ మాడోతు అనిత భర్త భగవాన్ నాయక్ కొద్ది రోజుల క్రితం మరణించడంతో వారి కుటుంబానికి జిల్లా రేషన్ డీలర్ల కమిటీ తరఫున 50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు కందుల శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యలగూడెం వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు సుర్వి వెంకటేష్ గౌడ్, పార్వతమ్మ ,యాదయ్య, తుర్కపల్లి మండల అధ్యక్షుడు కుక్కుటపు నవీన్ కుమార్,గౌరవ అధ్యక్షుడు కందుకూరి అమర్నాథ్, చౌటుప్పల్ మండల అధ్యక్షుడు లింగస్వామి గౌడ్, నారాయణపురం మండల అధ్యక్షుడు దూడల భిక్షం గౌడ్, రేపల్లె సత్యనారాయణ, తుర్కపల్లి ఉపాధ్యక్షుడు ఎద్దు వీరస్వామి, సర్వం నాయక్, ప్రధాన కార్యదర్శి గడ్డమీది మురళి ,కార్యవర్గ సభ్యులు తునికి రవీందర్ రెడ్డి, ఆదిమూలం సత్యనారాయణ, రవి, మచ్చ నరేష్ గౌడ్, చందా నాయక్, ఇస్మాయిల్ నాయక్, పుట్ట వెంకటేశం పాల్గొన్నారు.

## ఫార్మా వరుస ప్రమాదాలపై సమగ్ర విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు

- ఫార్మాసిటీ స్టాప్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు గౌరవ అధ్యక్షులు గని శెట్టి



**జయభేరి, పరవాడ:**
అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మా సిటీలో జులై 15 దక్షిణ ఎనర్జీ జూన్ 12న టొరంటో 13న లోహిత్ ఫార్మా జులై 14న శ్రీ సాయి చందన ఫార్మా జులై 18న విష్ణు కెమికల్స్ జరిగిన ప్రమాదాలపై సమగ్ర విచారణ చేసి చర్యలు చేపట్టాలని కోరుతూ ఫార్మా సిటీ స్టాప్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేశారు. డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ వారికి ఫిర్యాదు కాపీని అందజేశారు. వరస ప్రమాదాలతో కార్మికుల భయాందోళన గురవుతున్నారని భద్రతా ప్రమాణాలు అమలకు చర్యలు చేపట్టాలని ఫార్మా పరిశ్రమంలో భద్రత ఆడిట్ నిర్వహించాలని ఈ సందర్భంగా వారు కోరారు.



# నెల రోజుల పాటు.. చక్కెర తినడం మానేసి చూడు

**మనం తీసుకునే ఆహారంలో చక్కెర ఒక భాగమైనదని చెప్పవచ్చు. ఉదయం నిద్రలేచింది మొదలు సాయంత్రం నిద్రించే వరకు ఏదో ఒక రూపంలో చక్కెరను తీసుకుంటూనే ఉంటాం. టీ, కాఫీ, జ్యూస్, స్వీట్స్, కుక్కీస్ ఇలా ఏదో ఒక రూపంలో చక్కెర మన శరీరంలోకి వెళ్తూనే ఉంటుంది. అయితే చక్కెరను తీసుకోవడం 30 రోజుల పాటు మానేయడం వల్ల మనం అనేక శారీరక, మానసిక మార్పులను గమనించవచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే చక్కెరను మానేసిన తరువాత మొదట్లో మనం కొన్ని ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. చక్కెరను తీసుకోవడం మానేసిన తరువాత చిరాకు, అలసట, ఆందోళన వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. మెదడు చక్కెర అందించే డోపమైన్ హిట్ ను కోల్పోవడం వల్ల ఇలా జరుగుతుంది. చక్కెర తీసుకోవాలనే కోరిక ఎక్కువగా ఉంటుంది. శరీరం నెమ్మదిగా చక్కెరకు దూరం అయ్యే కొద్దీ ఈ కోరికలు తగ్గుతూ వస్తాయి.**

### కొవ్వు కరుగుతుంది..

డిటాక్స్ ట్రెండ్ కంటే ఎక్కువగా చక్కెరను తీసుకోకపోవడం వల్ల మన శరీరానికి కలిగే మేలే ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇలా చక్కెరను తీసుకోవడం తగ్గించడం వల్ల క్రమంగా రెండవ వారం నాటికి రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. రక్తంలో గ్లూకోజ్ మరింత సమర్థవంతంగా నిర్వహించబడుతుంది. ఇన్సులిన్ స్థాయిలు తగ్గడంతో శరీరం నిల్వ ఉన్న కొవ్వును కరిగించడం ప్రారంభిస్తుంది. తద్వారా శరీర బరువు తగ్గుతుంది. ఇక మూడవ వారం కూడా చక్కెరను తీసుకోవడం మానేయడం వల్ల మనం దీర్ఘకాలిక ప్రయోజనాలనుగమనించవచ్చు. చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. దద్దుర్లు, మంట, మొటిమలు, పగుళ్లు వంటివి తగ్గుతాయి. అకాల వృద్ధాప్యం రాకుండా ఉంటుంది. రక్తంలో చక్కెర క్రాష్ లు తగ్గడం వల్ల మనం మరింత స్థిరంగా దృష్టి కేంద్రీకరించవచ్చు.

### కొలెస్ట్రాల్ అదుపులో..

క్యాలరీలు తీసుకోవడం తగ్గడం వల్ల శరీర బరువు తగ్గడాన్ని మనం ఎక్కువగా గమనించవచ్చు. అంతేకాకుండా అధిక కొలెస్ట్రాల్, ఫ్యాటీ లివర్ వంటి కాలేయ వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుందని వైద్యులు తెలియజేస్తున్నారు. ఇక చక్కెర ఉండే స్వీట్లు, పానీయాలు, బేక్ చేసిన వస్తువులు తీసుకోవడం తగ్గించడం వల్ల ప్రజలు పండ్లు, గింజలు వంటి వాటిని తీసుకోవడానికి మొగ్గు చూపుతారు. దీంతో శరీరానికి కావల్సిన పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి. చక్కెర కలిగిన ఆహార పదార్థాలకు బదులుగా నానబెట్టిన ఖర్జూరాలు, పెరుగు వంటి వాటిని తీసుకోవడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. పేగు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

### ఉత్సాహంగా మారుతారు..

అంతేకాకుండా చక్కెరలో వచ్చే హెచ్చుతగ్గులు బద్ధకం, చిరాకుకు కారణమవుతాయి. కనుక చక్కెరను మానేయడం వల్ల మనం ఉత్సాహంగా ఉండడంతో పాటు మానసికంగా ఉత్సాహంగా ఉండవచ్చు. ఇలా నెలరోజుల పాటు చక్కెర తీసుకోవడం మానేయడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు. చక్కెర మానేయడం తాత్కాలికంగానే కాకుండా స్థిరమైన జీవనశైలి ఎంపికగా ఉండాలని వారు సూచిస్తున్నారు. చక్కెరకు బదులుగా బెల్లం, తేనె, ఖర్జూరం వంటి వాటిని మితంగా తీసుకోవాలి. అలాగే తీపి వంటకాల తయారీలో చక్కెరకు బదులుగా యాలకులు, దాల్చిన చెక్క వంటి వాటిని వాడడం వల్ల తీపి తింటున్నామన్న అనుభూతి పెరుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు.



# జంక్ ఫుడ్ మానేస్తే.. మీ ముఖంలో కనిపించే మార్పులు

**జంక్ ఫుడ్ ఆరోగ్యానికి మంచిది కాదని అందరికీ తెలుసు. అయినా సరే చాలామంది ఆ ఫుడ్ నే ఇష్టంగా తింటుంటారు. కానీ జంక్ ఫుడ్ ని ఒక 30 రోజులు మానేస్తే మీ శరీరంలో ఎన్ని మార్పులు జరుగుతాయో తెలుసా? ముఖ్యంగా ఫేస్ లో కనిపించే ఈ మార్పులు చూస్తే షాక్ అవుతారు.**

### 30 రోజులు జంక్ ఫుడ్ మానేస్తే..

మనలో చాలామంది ఫాస్ట్ ఫుడ్, ప్యాకేజ్డ్ స్నాక్స్, కేక్‌లు, చిప్స్ వంటి పదార్థాలను ఇష్టంగా తింటుంటారు. కానీ అవి మన శరీరం, ముఖ్యంగా చర్మంపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో తెలుసా? ఆరోగ్య నిపుణులు, స్కిన్ కేర్ ఎక్స్‌పర్ట్‌ల ప్రకారం కేవలం 30 రోజులు జంక్ ఫుడ్ మానేయడం ద్వారా ముఖంలో కలిగే మార్పులేంటో ఇక్కడ తెలుసుకుందాం.

### మృదువుగా మారుతుంది

జంక్ ఫుడ్ ఎక్కువగా సాచ్యురేటెడ్ ఫ్యాట్స్, షుగర్, ప్రాసెస్డ్ పదార్థాలను కలిగి ఉంటుంది. ఇది చర్మంలో ఇన్ఫ్లమేషన్ ను పెంచుతుంది. ముడతలు, ఎరుపు, పొడిబారడం వంటి సమస్యలకు కారణమవుతుంది. జంక్ ఫుడ్ మానేసిన వెంటనే, శరీరంలోని ఇన్ఫ్లమేటరీ రియాక్షన్స్ తగ్గుతాయి. 30 రోజుల్లో చర్మం సహజంగా హైడ్రేటెడ్ గా, మృదువుగా మారుతుంది. ముఖ్యంగా కేకులు, కోల్డ్ డ్రింక్స్, చిప్స్ మానడం వల్ల చర్మం.. లోపలి తేమను నిలుపుకోవడానికి అవకాశం ఉంటుంది.

### కొల్లాజెన్ ఉత్పత్తిపై ప్రభావం

షుగర్ అధికంగా తీసుకోవడం వల్ల చర్మంలోని కొల్లాజెన్ దెబ్బతింటుంది. కొల్లాజెన్ శక్తిని కోల్పోవడం వల్ల చర్మంపై ముడతలు మొదలవుతాయి. 30 రోజులు జంక్ ఫుడ్ మానేయడం ద్వారా, కొల్లాజెన్ ఉత్పత్తి సక్రమంగా ఉంటుంది. దానివల్ల చర్మం స్థిరంగా ఉంటుంది, ముడతలు తగ్గుతాయి. కాంతివంతంగా మారుతుంది.

### ముఖం స్లిమ్ గా కనిపించడం


జంక్ ఫుడ్ ఎక్కువగా సోడియం, ఫ్యాట్, ప్రాసెస్డ్ పదార్థాలను కలిగి ఉంటుంది. ఇది శరీరంలో వాటర్ రిటెన్షన్, మలినాలు, ఫేస్ బ్లోటింగ్ కు కారణమవుతుంది. ఆరోగ్య నిపుణుల ప్రకారం, 30 రోజులు జంక్ ఫుడ్ మానేసి.. సరైన ఆహారం తీసుకోవడం ద్వారా ఫేస్ బ్లోటింగ్ తగ్గి ముఖం స్లిమ్ గా కనిపిస్తుంది. అలాగే, యాంటీ ఆక్సిడెంట్‌లు ఎక్కువగా ఉండే ఫుడ్స్ తీసుకోవడం వల్ల చర్మం లోపలి నుంచి మెరుగుపడుతుంది.

### ముఖం ఫ్రెష్ గా..

జంక్ ఫుడ్ లోని ఫ్యాటీ, ప్రాసెస్డ్ పదార్థాలు శరీరంలోని యాంటీఆక్సిడెంట్ స్థాయిలను తగ్గిస్తాయి. చర్మం యూవీ కిరణాల ప్రభావానికి లోనవుతుంది. జంక్ ఫుడ్ మానేసి.. ఇతర ఫ్రూట్స్, వెజిటబుల్స్ తీసుకుంటే వాటిలోని యాంటీ ఆక్సిడెంట్‌లు చర్మ రికవరీని వేగవంతం చేస్తాయి. సన్‌డ్యామేజ్ తగ్గి, చర్మం తాజాగా మారుతుంది.

### ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

చర్మంలో కనిపించే ఈ మార్పులు మానసికంగా పెద్ద మార్పులకు దారితీస్తాయి. 30 రోజులు జంక్ ఫుడ్ మానేస్తే.. ముఖం స్పష్టంగా మెరుస్తుంది, చర్మం ఆరోగ్యంగా కనిపిస్తుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. జంక్ ఫుడ్ మానేయడం ఒక్క చర్మ ఆరోగ్యానికే కాదు.. మొత్తం శరీర ఆరోగ్యానికి మేలు చేస్తుంది.



# జుట్టుకు ఎన్ని రోజులకు ఒకసారి ఆయిల్ రాయాలి?

**జుట్టు ఒత్తుగా, ఆరోగ్యంగా పెరగడానికి మనం తలకు నూనె రాస్తుంటాం. తలపై నూనెతో స్మూత్ గా మసాజ్ చేస్తే ప్రశాంతంగా అనిపిస్తుంది. జుట్టు కుదుళ్లు కూడా బలపడతాయి. జుట్టు చక్కగా పెరగాలంటే ఎన్ని రోజులకు ఒకసారి నూనె రాయాలి? నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసా?**

మనం జుట్టుకు రెగ్యులర్ గా నూనె రాస్తుంటాం. దానివల్ల జుట్టు ఒత్తుగా, ఆరోగ్యంగా పెరుగుతుంది. కానీ జుట్టుకు ఎన్ని రోజులకు ఒకసారి ఆయిల్ రాయాలి? రోజూ రాయడం మంచిదా? లేక వారంలో ఒకటిరెండు సార్లు రాస్తే సరిపోతుందా? నిపుణులు ఏం చెబుతున్నారో ఇక్కడ వివరంగా తెలుసుకుందాం.

### వారానికి 1-2 సార్లు

ఆరోగ్య నిపుణుల ప్రకారం జుట్టుకు వారానికి 1-2 సార్లు ఆయిల్ రాయడం మంచిది. సాధారణ లేదా డ్రై హెయిర్ ఉన్నవారు వారానికి రెండు సార్లు రాసుకోవచ్చు. ఆయిలీ స్కాల్ప్ ఉన్నవారు వారానికి ఒకసారి జుట్టుకు నూనె రాస్తే సరిపోతుంది. దానివల్ల స్కాల్ప్ ఉత్పత్తి చేసే సహజ నూనెలపై చెడు ప్రభావం పడదు.

### రోజూ రాస్తే ఏమవుతుంది?

సాధారణంగా చాలామంది రోజూ నూనె రాసుకుంటే జుట్టు బాగా పెరుగుతుందని అనుకుంటారు. కానీ దానివల్ల హెయిర్ ఫోలికల్స్ బలహీనపడే అవకాశం ఉంది. అంతేకాదు దుమ్ము, ధూళి వంటివి తలపై చేరి చర్మ రంధ్రాలు మూసుకుపోతాయి. ఫలితంగా చుండ్రు, ఇరిటేషన్, హెయిర్ ఫాల్ వంటి సమస్యలు ఎదురవుతాయి.

### నూనె వేడి చేసి రాస్తే..

ఆయిల్ వాడటం వల్ల జుట్టుకు హైడ్రేషన్ లభిస్తుంది. తలపై స్మూత్ గా మసాజ్ చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగవుతుంది. అయితే చాలామంది నూనెను కొద్దిగా వేడి చేసి జుట్టుకు అప్లై చేస్తుంటారు. గోరువెచ్చని నూనెతో తలపై మసాజ్ చేస్తే.. జుట్టులోకి సులభంగా ఇమిడిపోతుంది. అలాగే రక్తప్రసరణ మెరగవుతుంది. కానీ నూనెను ఎక్కువ వేడి చేయడం మంచిది కాదు. అదే విధంగా జుట్టుపై బలంగా రుద్దడం కూడా ప్రమాదకరం అని నిపుణులు సూచిస్తున్నారు.

### ఎక్కువసేపు ఉంచితే?

జుట్టుకు నూనె రాసిన తర్వాత మరీ ఎక్కువసేపు ఉంచకూడదు. 45 నిమిషాల నుంచి 2 గంటల వరకు ఉంచితే సరిపోతుంది. దానికంటే ఎక్కువసేపు ఉంచితే.. ప్రయోజనాల కంటే నష్టాలే ఎక్కువని నిపుణులు చెబుతున్నారు. ఫంగల్ ఇన్ఫెక్షన్లు, చుండ్రు, జుట్టు రాలడం వంటి సమస్యలు ఎదురవుతాయని సూచిస్తున్నారు.

### ఏ నూనె వాడొచ్చు?

నిపుణుల ప్రకారం జుట్టు రకాన్ని బట్టి నూనెను ఎంచుకోవాలి. పొడి జుట్టుకు కొబ్బరి నూనె వాడొచ్చు. కొబ్బరినూనె జుట్టు లోపలి వరకు చొచ్చుకుపోయే గుణాలను కలిగి ఉంటుంది. అలాగే మందపాటి జుట్టుకు బాదం నూనె, జుట్టు పెరుగుదలకు ఆముదం నూనె వంటివి వాడొచ్చు.



# నెట్టింట హీటెక్కిస్తున్న గ్లామర్ బ్యూటీ..




శ్వేత తివారీ.. హిందీ బుల్లితెర చిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేసింది. ఇప్పటికీ సీరియల్స్ ద్వారా ప్రేక్షకులను అలరిస్తుంది. ప్రస్తుతం ఆమె వయసు 45 సంవత్సరాలు. ఇప్పటికీ పాతికేళ్ల అమ్మాయిల అలరిస్తుంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ అమ్మడు ఫిట్నెస్ సీక్రెట్స్ గురించి సోషల్ మీడియాలో చర్చ నడుస్తుంది. ఆమె తన ఫిట్నెస్ కోసం వర్కవుట్స్ చేయరు. ఆమె క్రమం తప్పకుండా వాకింగ్ చేస్తారు. గత రెండు నెలలుగా పిలేట్స్ అనే వ్యాయమం చేయడం ప్రారంభించినట్లు తెలిపారు. ఇది శరీరాన్ని ఫ్లెక్సిబుల్ గా ఉంచుతాయి. అలాగే యోగా చేయడం, ధ్యానం చేస్తూ తన శ్వాస పై శ్రద్ధ వహిస్తారు. అంతేకాకుండా కఠినమైన ఆహార పదార్థాలు తీసుకుంటారు. ఆమె తీసుకునే ఆహారంలో ప్రోటీన్లు, ఫైబర్, బ్రౌన్ రైస్, పప్పులు, తాజా పండ్లు ఎక్కువగా ఉంటాయట. అలాగే ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు, బయటి జంక్ ఫుడ్, తీపి పదార్థాలకు ఆమె పూర్తిగా దూరంగా ఉంటానని చెప్పుకొచ్చారు. రోజూ తగినంత నీరు, కొబ్బరి నీళ్లు, తాజా పండ్ల రసాలు తీసుకుంటారు. షూటింగ్ సమయంలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ డైట్ విషయంలో ఏమాత్రం అశ్రద్ధ వహించనని తెలిపారు. రెండుసార్లు విడాకులు తీసుకున్న శ్వేత తివారీ ఇప్పుడు ఒంటరిగానే ఉంటున్నారు. ఆమె కూతురు పాలక్ తివారీ ఇప్పుడిప్పుడే కథానాయికగా ఎంట్రీ ఇచ్చేందుకు రెడీ అవుతుంది.




# సెలబ్రేషన్‌లో రౌడీ జనార్ధన

అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ నటిస్తున్న ప్రతిష్టాత్మక రూరల్ యాక్షన్ డ్రామా 'రౌడీ జనార్ధన'. రవికిరణ్ కోలా దర్శకుడు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నది. డిసెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సోమవారం దర్శకుడు రవికిరణ్ కోలా పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయనకు చిత్రబృందం శుభాకాంక్షలు తెలుపుతూ.. ఈ సినిమా సెట్స్ నుంచి ఆయన వర్కింగ్ స్టిల్స్‌ని విడుదల చేశారు. 'రౌడీ జనార్ధన' చిత్రాన్ని రవికిరణ్ ఎంత ప్యాషనేట్‌గా, కాన్ఫిడెంట్‌గా తెరకెక్కిస్తున్నారో ఈ స్టిల్స్ చూస్తే అర్థమవుతున్నది. కీర్తి సురేశ్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో డా.రాజశేఖర్ కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి కెమెరా: ఆనంద్ సి.చంద్రన్.

# ఆజాద్ హింద్ 'ఫౌజీ'?



పాత్ర చిత్రణ, కథ, కథనం.. ఈ మూడూ సినిమా విజయంలో ప్రధాన భూమిక పోషిస్తుంటాయి. వీటి విషయంలో దర్శకుడు అప్రమత్తంగా ఉంటే చాలు.. విజయం తథ్యం. దర్శకుడు హను రాఘవపూడి 'ఫౌజీ' చిత్రం విషయంలో ఈ జాగ్రత్తలన్నీ తీసుకుంటూ ముందుకెళ్తున్నారు. ఆయన గత విజయం 'సీతారామం' విషయంలోనూ ఇదే రీతిని అనుసరించారాయన. 'ఫౌజీ'లో ప్రభాస్ పాత్ర తీరుతెన్నుల గురించి ఆసక్తికరమైన వివరాలు ప్రస్తుతం వెలుగు చూశాయి. ఇందులో ప్రభాస్ సైనికుడిగా కనిపిస్తారని ముందునుంచీ చెబుతూనే ఉన్నారు అయితే.. కథ రీత్యా ముందు ఆయన బ్రిటీష్ ఇండియన్ ఆర్మీ సైనికుడిగా కనిపిస్తారట. ఆ తర్వాత నేతాజీ సుభాష్ చంద్రబోస్ 'అజాద్ హింద్ ఫౌజ్' స్థాపించడంతో నేతాజీ నేతృత్వంలో స్వాతంత్ర్య పోరాటం సాగించేందుకు తాను కూడా అజాద్ హింద్ ఫౌజ్‌లో చేరతాడట. భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఓ సైనికుని కథగా ఈ సినిమా సాగుతుందని టాక్. ఇందులో ప్రభాస్ పాత్ర.. ధైర్య సాహసాలతో, త్యాగం, దేశభక్తితో నిండి ఉంటుందని వినికిడి. ఇమాన్వి కథానాయిక నటిస్తున్న ఈ చిత్రంలో అద్భుతమైన ప్రేమకథ కూడా ఉంటుందట. మైత్రీ మూవీమేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.



# నెగెటివ్ రోల్‌లో ఐశ్వర్య?

వైవిధ్యమైన కథాంశాల్ని ఎంచుకుంటూ దక్షిణాదిలో ప్రతిభావంతురాలైన కథానాయికల్లో ఒకరిగా పేరు తెచ్చుకుంది ఐశ్వర్యరాజేష్. అయితే ఈ భామకు తెలుగులో మాత్రం కాస్త ఆలస్యంగానే బ్రేక్ దొరికింది. గత ఏడాది 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో తెలుగులో ఆమె తొలి బ్లాక్‌బస్టర్ హిట్‌ని సొంతం చేసుకుంది. ప్రస్తుతం తమిళ, కన్నడ సినిమాల్లో బిజీగా ఉన్న ఈ అమ్మడు తెలుగులో ఓ బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. అగ్ర కథానాయకుడు బాలకృష్ణ‌కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా ప్రకటన రోజు నుంచి వార్తల్లో నిలుస్తున్నది. గాడ్ ఆఫ్ మాసెస్‌గా అభిమానులు పిలుచుకునే బాలకృష్ణ.. సామాజిక అంశాల మేళవింపుతో మాస్ కథాంశాల్ని తెరకెక్కించడంలో సిద్ధహస్తుడైన దర్శకుడు కొరటాల శివ కలయిక వెండితెరపై సంచలనాల్ని సృష్టించడం ఖాయమని అభిమానులు ధీమాగా ఉన్నారు. త్వరలో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనుంది. ఇందులో ఐశ్వర్యరాజేష్ ఓ కీలక పాత్రకు ఎంపికైందని తెలిసింది. నెగెటివ్ షేడ్స్‌తో ఆమె పాత్ర సాగుతుందని, కథాగమనంలో చాలా కీలకంగా ఉంటుందని చెబుతున్నారు. ఈ చిత్రాన్ని సుధాకర్ చెరుకూరి, సుధాకర్ మిక్కిలినేని సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# 'శ్రీనివాస మంగాపురం' మూవీ నుంచి 'రావే చెలియా' రిలీజ్



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు అన్న కుమారుడు జై కృష్ణ ఘట్టమనేని అజయ్ భుపతి దర్శకత్వంలో 'శ్రీనివాస మంగాపురం' సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానిని కూడా ఈ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో సీనియర్ నటుడు డాక్టర్ మోహన్ బాబు పవర్ ఫుల్ పాత్రను పోషిస్తున్నారు. నిర్మాత పి. కిరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని అశ్విని దత్ సమర్పిస్తున్నారు. ఇప్పటివరకు విడుదలైన పాటలు, టీజర్లు, ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. తాజాగా మేకర్స్ ఈ చిత్రం నుంచి రావే చెలియా సాంగ్ ని లాంచ్ చేశారు. జీవీ ప్రకాశ్ కుమార్ ఈ పాట ప్రేమ, భావోద్వేగాలతో హార్ట్ టచ్చింగ్ మెలోడీగా కంపోజ్ చేశారు.

నాగ్ అర్జున్ రెడ్డి అందించిన మనసుని తాకే సాహిత్యానికి, కపిల్ కపిలన్ తన వోకల్స్ తో ప్రాణం పోశారు. ప్రేమ, ఎడబాటు, మనసులోని భావాలను ఈ పాట అద్భుతంగా పలికించింది. ఈ పాటలో జై కృష్ణ, రాషా తడానీ మధ్య ప్రేమ, దూరమైనప్పుడు కలిగిన ఎమోషన్స్ ప్రేక్షకులను హత్తుకున్నాయి. విజువల్స్ కూడా పాట ఎమోషన్ ని మరింత ఎలివేట్ చేశాయి. అజయ్ భూపతి తన మార్క్ ఇంటెన్సిటీకి అందమైన ప్రేమకథ, పవర్‌ఫుల్ యాక్షన్‌ను జోడిస్తూ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ పాటల్లో జై కృష్ణ ఘట్టమనేని, రాషా తడానీ తమ ఆకట్టుకునే నటనతో మంచి ఇంప్రెషన్ క్రియేట్ చేశారు. ఈ చిత్రం అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందుతోంది. జయకృష్ణ ISC సినిమాటోగ్రఫీని నిర్వహించగా, జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. మాధవ్ కుమార్ గుళ్ళపాటి ఎడిటర్‌గా వ్యవహరిస్తుండగా, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైనర్. ఈ చిత్రం జూలై 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com**, **www.jayabheridaily.com**